ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కాకినాడ
జిల్లా వార్తలు
ఆదివారం 7 డిసెంబరు 2025 | 5








నరుడు.. వానరుడు!

అడవుల్లో ఉండాల్సిన వానరమూక జనారణ్యంలోకి ఎందుకొస్తుంది..? ఇది సమాధానంలేని ప్రశ్న.. ఒకనాడు వానరమూకను చూడాలంటే అటవీ ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది.. మరిప్పుడో జనారణ్యాన్నే అడవులుగా మార్చుకుంటున్నాయి.. ఇష్టానుసారం ప్రవర్తిస్తున్నాయి.. కోతి చేష్టలతో జనాలను ఇబ్బంది పెడుతున్నాయి..పై చిత్రంలోనే వానరమూకను చూడండి.. ఒక గోడ ఎక్కడానికి ఎంత హడావుడి చేస్తున్నాయో. అటు పంటలను నాశనం చేస్తున్నాయి.. ఇటు ఇళ్లపై దాడులు చేస్తున్నాయి.. తట్టుకోలేని జనం బాబోయ్ వా..నరకం భరించలేకపోతున్నాం.. అడవులకు తరలించాలని వేడుకుంటున్నారు.. వానరాలు అడవులను వదిలి జనారణ్యంలోకి ఎందుకొస్తున్నాయనే దానిపై అటవీ అధికారులు దృష్టిపెట్టాలి మరి.. - వివరాలు 6లో

కుడితే అంతేనండోయ్!

ఈ చిత్రంలో పురుగు చూస్తే దోమలా ఉంది కదూ.. ఆ జాతికి చెందినదే అయి ఉండొచ్చు కానీ.. దోమ మాత్రం కాదు.. ఇటీవల స్క్రబ్ టైఫస్ కేసులు అధికంగా నమోదవుతున్నాయి.. కాకినాడ జిల్లాలో ఈ తరహా కేసులు అధికంగా ఉన్నాయి.. తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల్లో మాత్రం ఇంత వరకూ నమోదు కాలేదు.. స్క్రబ్ టైఫస్ ఎలా వస్తుందంటే ఒక నల్లి లాంటి పురుగు కుట్టడం ద్వారా సంక్రమిస్తుందని చెబుతున్నారు.. అది ఎలా ఉంటుందనేది ఇప్పటి వరకూ ఎవరికీ తెలియదు.. అయితే జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల్లో మాత్రం ఇప్పటికే చర్యలు చేపట్టారు. అనుమానితులకు ర్యాపిడ్ టెస్టులు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు.. ఈ మేరకు జిల్లా కేంద్రాల్లోని ఆసుపత్రుల్లో ప్రత్యేకంగా ర్యాపిడ్ కిట్‌లు సిద్ధం చేశారు. వైద్యాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. - వివరాలు 7లో



అభలే!

మహిళా రాపిడోలు..రయ్‌రయ్



ఆమె లేని రంగమేదైనా ఉందా... అందుగలదు.. ఇందులేదని సందేహం వలదు..ఎందెందు వెదికినా ఆమె గలదు.. ఎందుకంటే.. ఏ రంగమైనా మేం సైతం అంటున్నారు.. కూటమి సర్కారు కూడా స్త్రీశక్తికి జైకొడుతోంది.. మహిళల ఆర్థిక స్వావలంభనకు తన వంతు అండగా నిలుస్తోంది.. ఎదుగుదలను ప్రోత్సహిస్తోంది.. గతంలో కాకినాడ, రాజమహేంద్రవరంలో 50 మంది మహిళలకు సబ్సిడీపై రాపిడో ఈ బైక్‌లను ప్రోత్సహించింది.. ఆదరణ బాగుండడంతో ఏకంగా 255 బైక్‌లను రంగంలోకి దించేందుకు సమాయత్తమవుతోంది.. మహిళలు భలేభలే అంటూ ఉత్సాహం చూపుతున్నారు.



మహిళలకు ఈ బైక్‌లు ఇస్తున్న కాకినాడ జిల్లా ఇన్‌చార్జి మంత్రి నారాయణ(ఫైల్)

- ఉమ్మడి జిల్లాలో మహిళలకు ఛాన్స్
- త్వరలో మెప్మా ఆధ్వర్యంలో ఎంపిక
- కాకినాడ జిల్లాలో 230
- రాజమహేంద్రవరంలో 25 మంది
- సబ్సిడీపై ఈబైక్‌లు అందజేత
- గతంలో మహిళా రైడర్లకు ఆదరణ

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

మహిళలు ఆర్థిక స్వావలంభన సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మెప్మా ద్వారా రాపిడో ఈ బైక్‌లు ఇచ్చి ప్రోత్సహిస్తోంది.ప్రస్తుతం కాకినాడ, రాజమహేంద్రవరం నగరాల్లో ప్రయో గాత్మకంగా ప్రవేశపెట్టిన మహిళా రాపిడో ఈ వాహనాలకు ఆదరణ బాగుండడంతో కొత్తగా మరింత మందికి అవకాశం ఇవ్వాలని నిర్ణయించింది. కాకినాడ జిల్లాలో 230 మంది, రాజమహేంద్రవరంలో మరో 25 మందిని ఎంపిక చేయడానికి కసరత్తు ప్రారంభించింది.మరోపక్క డ్వాక్రా గ్రూపుల్లో మహిళలు రాపిడో ద్వారా బైక్‌లు నడపడానికి ముందుకు వస్తే ఆ సంస్థకు తొలి మూడు నెలలు ప్లాట్‌ఫాం ఛార్జీలు చెల్లించక్కర్లేకుండా ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది.ఆ తర్వాత నుంచి నెలకు వెయ్యి చెల్లించాల్సి ఉండగా ఒక్కో వాహనానికి నెలకు 300 బుకింగ్‌లు రాపిడో ఇవ్వనుంది.

రాబడి రయ్..రయ్...

మహిళలు ఆర్థికంగా ఎదిగేలా చేసేందుకు రాష్ట్రప్రభుత్వం రాపిడో సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. జిల్లాల్లో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ద్వారా స్వయం సహాయక బృందాల్లోని సభ్యులను ఎంపిక చేసి వారికి ఎలక్ట్రికల్ బైక్‌లు అందిస్తోంది. దీంతో వీరు నిత్యం రాపిడో ద్వారా ప్రయాణీకులను వారి గమ్య స్థానాలకు బైక్‌లపై చేర్చి నెలనెలా కొంత ఆదాయం సంపాదించుకునేలా చేయాలని లక్ష్యం పెట్టుకుంది.మహిళలు సురక్షితంగా తమ ప్రాంతాలకు వెళ్లడానికి రాపిడో ద్వారా మహిళలే వస్తే వారికి స్వయం ఉపాధి లభించినట్లవు తుందని ప్రభుత్వం భావించింది. అందులో భాగంగా ఈ ఏడాది జూన్ నుంచి పథకాన్ని పట్టాలెక్కించింది. పైలట్ ప్రాజెక్టు కింద తొలుత కాకినాడ, రాజమహేంద్రవరం నగరాల్లో చెరో 25 మంది మహిళలను ఎంపిక చేసింది. వీరంతా స్థానికంగా ఉన్న డ్వాక్రా గ్రూపు మహిళలే. వీరికి బ్యాంకు ద్వారా ఎలక్ట్రిక్ బైక్‌కు రుణం ఇప్పించింది. అటు ప్రభుత్వం తరఫున రూ.15 వేల వరకు సబ్సిడీ అందించింది. ఇప్పుడు ఈ మహిళంతా రాపిడో ద్వారా ఈ బైక్‌లతో ఎంచక్కా తిరుగుతున్నారు.ఒక్కో రాపిడో మహిళా బైక్ రైడర్‌కు నెలకు రూ.18 వేల నుంచి రూ.22 వేల వరకు ఆదాయం లభిస్తోంది.రైడ్‌లకు వెళితే రోజుకు రూ.800 నుంచి రూ.వెయ్యి వరకు ఆదాయం సంపాదిస్తున్నారు.

కాకినాడలో..

కాకినాడ నగరంలో మెప్మా ద్వారా ఎంపిక చేసిన మహిళలకు రాపిడో ద్వారా ఆదాయం బాగుండ డంతో మరింత మంది మహిళలను ఎంపిక చేయడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. త్వరలో మరో 75మందిని రాపిడోతో అనుసంధానించబోతున్నారు. కాకినాడలో ఆదరణ బాగుండడంతో మొత్తం వందమందిని ఎంపిక చేయాలని మెప్మా లక్ష్యం విధించుకుంది.పిఠాపురం మునిసిపాలిటీ పరిధిలో 25, సామర్లకోట 30, పెద్దాపురం 25, గొల్లప్రోలు 25, తుని 25, ఏలేశ్వరంలో 25 మంది చొప్పున మొత్తం జిల్లాలో కాకినాడ కార్పొరేషన్, మిగిలిన మునిసిపాలిటీలు, నగర పంచాయతీలు కలిపి త్వరలో 255మందిని ఎంపిక చేయనున్నారు. తద్వారా ఎలక్ట్రిక్ బైక్‌లు కొనుగోలుకు రూ.5.28 కోట్ల వరకు వ్యయం అవుతుందని అంచనా వేశారు. డ్వాక్రా గ్రూపు సభ్యుల్లో ఒకరు లేదా వారి కుటుంబ సభ్యుల్లో ఆసక్తి కలిగిన వారిని అధికారులు ఎంపిక చేస్తున్నారు.

రాజమహేంద్రవరంలో..

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం నగరంలో ఇప్పటికే 25మంది రైడర్లు ఉండగా, మరో 25 మందిని ఎంపిక చేయడానికి కసరత్తు మొదలుపెట్టారు. తొలుత ప్రయోగాత్మకంగా ఎంపిక చేసిన 25 మందిలో కొందరి ఈ బైక్‌లు విజయవాడ నుంచి రప్పించడంతో తరచూ మరమ్మతుకు గురవుతున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో కొత్తగా ఎంపిక చేయనున్న మహిళా రైడర్లకు ఇకపై రాజమహేంద్రవరంలోనే ఎలక్ట్రిక్ బైక్‌లు అందించేలా ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకున్నారు.

మరి కొన్ని మునిసిపాలిటీలు

కొవ్వూరు, నిడదవోలు మున్సిపాల్టీలు, కోనసీమ జిల్లాలో అమలాపురం, మండపేట, రామచంద్రపురం మునిసిపాలిటీల్లోనూ ఈ సర్వీసులు కొనసాగేలా అధికారులు ప్రయత్నం చేశారు. మెప్మా అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులతో నుమాట్లాడారు. ప్రస్తుతం కొన్ని మునిసిపాలిటీల పరిధిలో డిమాండ్ లేదని, ఉన్న రూట్లలో త్వరలో బైక్‌లు లేదా ఎలక్ట్రికల్ ఆటోలు నడిపేలా మహిళలను ఎంపిక చేయాలని భావిస్తున్నారు.

హోంగార్డుల సేవలు అనిర్వచనీయం

- హోంగార్డుల వ్యవస్థాపక దినోత్సవంలో జిల్లా ఎస్పీ బిందుమాధవ్



జిల్లా పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో హోంగార్డుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

కాకినాడ క్రైం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పోలీస్‌శాఖ ద్వారా సమాజానికి హోంగార్డులు చేస్తున్న సేవలు అనిర్వచనీయమని ఎస్పీ జి. బిందుమాధవ్ అన్నారు. జిల్లా పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో శనివారం 63వ హోంగార్డుల వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్పీ హాజరయ్యారు. ఆయనకు హోంగార్డులు గౌరవ వందనం సమర్పించి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం పెరేడ్ కమాండర్ కె. రాజేష్ నాయుడు నేతృత్వంలో రైజింగ్ డేను పురస్కరించుకుని పెరేడ్ నిర్వహించి గౌరవ వందనం సమర్పించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్‌శాఖకు వెన్నెముకగా నిలిచి విధి నిర్వహణలో హోంగార్డులు ఉత్తమ సేవలు అందిస్తున్నారని ప్రశంసించారు. దేశంలో ప్రథమంగా 1946లో ముంబయిలో శాంతి భద్రతల పరిరక్షణకోసం పోలీసులకు సహకారం అందించేందుకు హోంగార్డు వ్యవస్థ ఏర్పడిందన్నారు. అనంతరం 1963, డిసెంబరు 6న మన రాష్ట్రంలో హోంగార్డు వ్యవస్థ ప్రారంభించారన్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 951మంది హోంగార్డులు పనిచేస్తున్నారన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ, నేరనియంత్రణ, సీఐడీ, టాస్క్‌ఫోర్స్, పోలీస్ అంతర్గత భద్రత, పోలీస్ వాహనాల డ్రైవర్లుగా, కంప్యూటర్ ఆపరేటర్‌లుగా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో భద్రతగా, అనేక టెక్నికల్ కేటగిరీల్లో హోంగార్డులు పనిచేస్తున్నారన్నారు. డీజీపీ ఆదేశాల మేరకు కొత్తగా ప్రతి పోలీస్‌స్టేషన్‌లో సీసీ కెమెరాల టెక్నీషియన్ విధులు నిర్వర్తిస్తున్నారన్నారు. అగ్ని ప్రమాదాలు, వరదలు, కొవిడ్-19 వంటి విపత్కర పరిస్థితులు ఏర్పడినప్పుడు హోంగార్డుల సేవలు కీలకమన్నారు. ముఖ్యంగా వీవీఐపీల బందోబస్తులు, దేవుళ్ల ఉత్సవాల బందోబస్తులు, నైట్ బీట్‌లు, డే బీట్‌లు వీరు సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. వీరిని పోలీస్‌శాఖ అన్నివిధాలా గౌరవించి అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ ఎస్.శ్రీనివాసరావు, కాకినాడ ఎస్‌డీపీవో దేవరాజ్ మనీష్‌పాటిల్, ఎస్‌బీ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, హోంగార్డు డీఎస్పీ టి.కిరణ్‌కుమార్, ఏఆర్ డీఎస్పీ శ్రీహరిరావు, హోంగార్డు ఆర్ఐ ఎంఎస్ మూర్తి పాల్గొన్నారు.



హోంగార్డుల కుటుంబీకులకు చెక్‌లు అందిస్తున్న ఎస్పీ

అంబేడ్కర్ సేవలు ఎప్పటికీ స్ఫూర్తి

- వర్ధంతి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ షాన్ మోహన్



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): యావత్ దేశానికి బాబాసాహెబ్ అంబేడ్కర్ దృఢమైన రాజ్యాంగం అందించారనీ, ఆయన దేశానికి చేసిన సేవలు ఎప్పటికీ స్ఫూర్తిగా నిలుస్తాయని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 69వ వర్ధంతిని పురస్కరించుకుని జిల్లా సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. కాకినాడ ఇంద్రపాలెం సెంటర్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి కలెక్టర్ షాన్‌మోహన్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక దేశాల రాజ్యాంగాలను అధ్యయనం చేసి భారతదేశానికే ఉత్కృష్టమైన రాజ్యాంగాన్ని అందించిన ఘనత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు దక్కిందన్నారు. ఆయన చదువుకోవడానికి ఏ మాత్రం అవకాశం లేని పరిస్థితుల నుంచి అత్యున్నతస్థాయికి చేరుకోవడం మన అందరికీ ఎంతో గర్వకారణమన్నారు. జైభీమ్ ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో అంబేడ్కర్ జీవిత విశేషాలతో కూడిన గీతాలాపన చేశారు. కార్యక్రమంలో కాకినాడ కార్పొరేషన్ ఇన్‌చార్జి కమిషనర్ సత్యనారాయణ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సత్యవతి, సాంఘిక సంక్షేమశాఖ జేడీ శోభారాణి, సమాచార పౌర సంబంధాలశాఖ డిప్యూటీ డైరెక్టర్ నాగార్జున, ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ విశాంత్రి వీసీ డాక్టర్ బాబ్జి, ఎస్‌ఈ వెంకట్రావు, దళిత, బహుజన, ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ సిద్ధాంతాలు ప్రతిఒక్కరికీ ఆదర్శం కావాలి: ఎస్పీ బిందుమాధవ్

కాకినాడ క్రైం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగకర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సిద్ధాంతాలు ప్రతిఒక్కరికీ ఆదర్శం కావాలని ఎస్పీ జి.బిందుమాధవ్ అన్నారు. డాక్టర్ అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి శనివారం ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సమానత్వం, న్యాయం, స్వేచ్ఛ గురించి అంబేడ్కర్ చేసిన పోరాట పటిమను స్మరిస్తూ కొనియాడారు. పోలీస్‌శాఖలో ప్రతిఒక్కరూ రాజ్యాంగ విలువలను పాటించడంఎంతో ముఖ్యమన్నారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ ఎస్. శ్రీనివాసరావు, కాకినాడ ఎస్‌డీపీవో దేవరాజ్ మనీష్ పాటిల్, ఎస్‌బీ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, హోంగార్డు డీఎస్పీ టి.కిరణ్ కుమార్, ఏఆర్ డీఎస్పీ వి.శ్రీహరిరావు, హోంగార్డు ఆర్ఐ ఎం.ఎస్ మూర్తి తదతరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

జిల్లాలో 1.36 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు

- 25,375 రైతుల ఖాతాల్లో రూ.289 కోట్లు జమ
- సివిల్ సప్లయ్ జిల్లా మేనేజరు దేవులనాయక్

సామర్లకోట, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో శనివారం సాయంత్రం నాటికి 1,36,768 మెట్రిక్ టన్నుల మేర ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన 269 రైతు సేవాకేంద్రాల ద్వారా కొనుగోళ్లు నిర్వహించామని సివిల్ సప్లయ్ జిల్లా మేనేజరు దేవులనాయక్ తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో రైతుల నుంచి ధాన్యం కొనుగోలును 3లక్షల మెట్రిక్ టన్నుల మేర కొనుగోలు చేయాలన్న లక్ష్యంగా నిర్దేశించామన్నారు. జిల్లావ్యాప్తంగా 106 రైస్‌మిల్లుల నుంచి రూ.182కోట్ల మేర బ్యాంకు గ్యారెంటీలు ఇప్పటికే స్వీకరించామన్నారు. ఆయా మిల్లుల పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అందుబాటులో ఉండేలా జిల్లావ్యాప్తంగా 1,766 రవాణా వాహనాలను ఏర్పాటు చేశామన్నారు. సామర్లకోట మండలంలో 272 రవాణా వాహనాలను అందుబాటులో ఉంచామన్నారు. వీటివల్ల ధాన్యం రవాణాకు ఎటువంటి అంతరాయం జరగదన్నారు. శనివారం సాయంత్రం వరకూ జిల్లావ్యాప్తంగా కొనుగోళ్లు చేసిన ధాన్యం 1,36,768 మెట్రిక్ టన్నులు కాగా వీటికి సంబంధించి ఇప్పటికే రూ.289కోట్ల మేర సొమ్ములను 25,375మంది రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేస్తామన్నారు. కొన్ని రైతు సేవా కేంద్రాల వద్ద టార్గెట్‌లు చేరువైన కారణంగా లక్ష్యాలు తగ్గిస్తున్నప్పటికీ ప్రభుత్వం రైతుల నుంచి చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తుందని రైతులు ఏ మాత్రం అపోహలకు గురికావద్దన్నారు. ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యానికి చెంది రైతులకు 24గంటలలోగా రైతుఖాతాల్లో సొమ్ములు జమవుతుందని చెప్పారు. రైతులకు ఎక్కడైనా ఇబ్బంది ఎదురైనా, ధాన్యం రవాణాలోను, డబ్బులు జమకావడంలోను సమస్యలుంటే జిల్లాలో కమాండ్ కంట్రోల్ రూమ్ నిరంతరం పనిచేస్తుందన్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 8886903611 హెల్ప్‌లైన్‌కు రైతులు ఫోన్ చేసిన వెంటనే సంబంధిత మండల అధికారులకు సమాచారం చేరవేసి సమస్య స్వభావాన్ని బట్టి వెంటనే చర్యలు తీసుకునే విధంగా వ్యవస్థను బలోపేతం చేశామని డీఎం దేవులనాయక్ తెలిపారు.

ఒకే విద్యార్థి.. ఒకే టీచరు!

- సామర్లకోట మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ఇది పరిస్థితి 6

21 నుంచి జేఎన్టీయూకేలో రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు 7

పెద్దిపాలెంలో భారీ అగ్నిప్రమాదం 7



జేసీగా బాధ్యతలు స్వీకరించిన అపూర్వభరత్

జేసీ బాధ్యతల స్వీకరణ

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): జాయింట్ కలెక్టర్‌గా అపూర్వ భరత్ శనివారం కలెక్టరేట్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు, కలెక్టరేట్ పరిపాలనాధికారి రామ్మోహన్‌రావు ఘనంగా స్వాగతం పలికారు. వేదపండితుల ఆశీర్వచనాల అనంతరం ఆయన జేసీగా బాధ్యతలు స్వీకరించారు. అసిస్టెంట్ కలెక్టర్ మనీషా, కాకినాడ ఆర్డీవో మల్లిబాబు, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ దేవులనాయక్, కేఆర్ ఆర్సీ ఎస్డీసీ రత్నమణి, డీఎస్‌వో సత్యనారాయణరాజు పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

లైంగిక దాడుల నియంత్రణపై సమీక్ష



సదస్సులో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ నాయక్

జీజీహెచ్(కాకినాడ), డిసెంబరు 6(ఆంధ్ర జ్యోతి): పిల్లలపై లైంగిక దాడులు వాటి నియంత్రణ, చట్టాలపై అవగాహన పెంపొందించేందుకు జిల్లావైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మండల స్థాయి సమీక్ష శనివారం నిర్వహించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ అవగాహనా కార్యక్రమంలో మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్ఐ, హెడ్‌మాస్టర్లు, అంగన్‌వాడీ వర్కర్లులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ 18ఏళ్లలోపుగల పిల్లల అభివృద్ధి, చిన్నారులపై జరుగుతున్న లైంగిక దాడుల్లో వారి మానసిక స్థితి, స్వీయ రక్షణ, చెడు, మంచి స్పర్శ, పిల్లలకు చెప్పాల్సిన సేఫ్టీ రూల్స్, తల్లిదండ్రులు, గురువులు, సమాజం బాధ్యత, పోక్సో, జెజె యాక్టల గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఏమైనా సంఘటనలు జరిగినప్పుడు చిన్నారులకు, వారి కుటుంబాలకు అండగా ఉండాలని తెలిపారు. 1098, పోలీస్, చైల్డ్‌వెల్ఫేర్ కమిటీలకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ వి.అరుణ, సైకియాట్రిస్ట్ డాక్టర్ కృష్ణవాసన్, సైకాలజిస్ట్ డాక్టర్ సాయిరాం, చిన్నపిల్లల వైద్యనిపుణుడు డాక్టర్ సిసిర్ రెడ్డి, అడ్వొకేట్‌లు జి.సునీల్ కాంత్‌కుమార్, ఏసుబాబు, మహిళా పీఎస్ ఎస్ఐ అనూషా, ఐసీడీఎస్ సీడీపీఓ, సూపర్‌వైజర్‌లు, డైక్ సిబ్బంది పాల్గొన్నారు.

పల్స్ పోలియోపై వైద్యాధికారులకు శిక్షణ

జీజీహెచ్(కాకినాడ), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఈనెల 21న జరగనున్న పల్స్ పోలియో కార్యక్రమానికి సంబంధించి కాకినాడ వివేకానంద పార్క్, స్మార్ట్‌సిటీ హాల్లో డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ ఆధ్వర్యంలో శనివారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, సూపర్‌వైజర్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ విధిగా అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్లలోపు ఉన్న పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలన్నారు. ప్రజలకు మరింత అవగాహన నిమిత్తం బూత్ బ్యానర్లు, స్ట్రీట్ బ్యానర్లు, గోడపత్రికలు పంపిణీ చేస్తామన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా మొబైల్ ద్వారా వాట్సాప్ సందేశాలు పెట్టడంద్వారా, జిల్లాలోని వివిధ శాఖల సమన్వయంతో విజయవంతం చేయాలని కోరారు. ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సిన ఐడీఎస్‌పీ ఫాంఎస్, పీ, ఎల్ ప్రతిరోజూ సక్రమంగా చేసేలా మోనటరింగ్ చేయాలన్నారు. జిల్లాలో ఉన్న 97 హాస్టళ్లను ప్రతి 15 రోజులకు ఒకసారి మెడికల్ ఆఫీసర్ తప్పనిసరిగా వెళ్లి పరీక్షలు నిర్వహించాలన్నారు. ప్రతి పీహెచ్‌సీలో బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పాటించాలన్నారు. సీజనల్ వ్యాధులు, స్క్రబ్‌టైఫస్, డయేరియా, మలేరియా, డెంగ్యూ వంటి వాటిపై అప్రమత్తత అవసరమని తెలియజేశారు. మొబైల్ పాయింట్స్, హైరిస్క్ ఏరియాలపై దృష్టిసారించాలని సూచించారు. డీఎల్‌టీవో డాక్టర్ ఎస్.చలమయ్య, డీఐఓ డాక్టర్ కేవీ సుబ్బరాజు డీపీఎంవో డాక్టర్ లక్ష్మి, పెద్దాపురం డివిజన్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.ప్రశాంతి పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో నాయక్

కోతుల నుంచి రక్షణకు మెస్..

అది ఒక ఆశ్రమం.. ప్రసాదం పెడితే చాలు కోతల మూకలు వాలిపోతున్నాయి.. కోతుల నుంచి రక్షణకు ఏం చేయాలని ఆలోచించా రు.. భక్తులకు ప్రసాదం పంపిణీ చేసే ప్రదేశం చుట్టూ ఇనుప కంచె వేశారు.. అయినా పైనుంచి వచ్చి కోతులు దాడి చేస్తున్నాయి..దీంతో పైనుంచి రాకుండా ప్రత్తిపాడు మండలం రాచపల్లి రమణ ఆశ్రమంలో భోజన ప్రదేశం వద్ద ఇనుప మెస్సులు వేశారు. ఈ ఒక్క సంఘటన చాలు కోతి చేష్టల పరిస్థితి చెప్పడానికి..

కోతులు పట్టించేందుకు ఇంటికి రూ.వెయ్యి..

కోతుల అలజడికి తునిరూరల్ గవరపేటలో గ్రామస్తులు ఇళ్ల నుంచి బయటకు రావడానికి హడలెత్తిపోతున్నారు. ఆదమరిస్తే ఇళ్లలోకి చొరబడి తినుబండారాలతో పాటు వంట సామగ్రి ధ్వంసం చేస్తున్నాయి. స్కూల్ పిల్లల వద్ద లంచ్‌బాక్సులు లాక్కుని దాడి చేస్తున్నాయి. కోతుల బెడదతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న గవరపేట గ్రామస్తులు ఏకతాటిపైకి వచ్చారు. ఇంటికొక రూ.1000 చందా వేసి ఒక కోతికి రూ.5 వేల చొప్పున వెచ్చించి వందలాది కోతులను పట్టించారు. వీటిని భద్రంగా ప్రత్యేక వాహనంలో ఏజెన్సీ ప్రాంతానికి తరలించారు. అయినా బెడద మాత్రం తీరలేదు..

కోతులకో కాపలాదారుడు..

రాజానగరం మండలంలో కోతులు పండ్ల తోటలపై ఇష్టానుసారం దాడి చేస్తున్నాయి.. నిమ్మపూత గిల్లడం, బొప్పాయి, అరటి మొక్కలను వేస్తుండగానే పీకేయడం, సీతాఫలాన్ని కాయ దశలోను, జీడిగింజలను తెంపేయడం వంటి కోతిచేష్టలతో రైతులు బాగా నష్టపోవాల్సి వస్తోందని శ్రీకృష్ణపట్నానికి చెందిన రైతు దొడ్డా అర్జున్ వాపోయాడు. కోతుల బారి నుంచి పంటను రక్షించుకోవడానికి రోజుకు రూ.700 నుంచి రూ.వెయ్యి వరకూ జీతాలుగా ఇచ్చి కాపలాదారులను ఏర్పాటు చేసుకుంటున్నారు. అయినా దాడులు ఆగడంలేదు.



వానరకమే!



తహశీల్దార్‌కు గతంలో కూనవరం విజయసాధన పాఠశాల విద్యార్థుల వినతి

కోతులను కొట్టడానికి కర్రలు అమ్ముతారక్కడ?

కూనవరంలో కోతులను తరిమేందుకు దుకాణాల్లో ప్రత్యేకంగా కర్రలను విక్రయిస్తున్నారు. ఎందుకంటే వాటి తీరు అంతదారుణంగా ఉంది. ఇటీవల కూనవరానికి చెందిన చుక్కమ్మ అనే వృద్ధురాలిపై కోతులు దాడిచేయడంతో ఆమె తలకు నాలుగు కుట్లు పడ్డాయి. ఇదే గ్రామానికి చెందిన జట్టి సత్యనారాయణ ఆలయానికి వెళ్లి పూజలు చేస్తుండగా ఆయనపై ఒక్కసారిగా కోతులు దాడిచేసి గాయపరిచాయి. విజయసాధన పాఠశాల విద్యార్థులు కోతుల కారణంగా చదువుకోలేకపోతున్నామని తహశీల్దార్ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.



కోతి చేష్టలు.. ఈ మాట తరచూ వింటుంటాం.. అయితే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ప్రత్యక్షంగా చూస్తున్నారు.. ఇబ్బందులు పడుతున్నారు.. అయినా ఏమీ చేయలేక చేష్టలుడిగి చూస్తున్నారు.. ఎందుకో ఏమో కానీ.. ఎక్కడో వనంలో ఉండాల్సిన కోతులు ఇటీవల జనావాసంలోకి చేరాయి.. ఎక్కడిబడితే అక్కడ కనిపిస్తున్నాయి.. గతంలో కొన్ని ప్రాంతాల్లో మాత్రమే కోతుల జాడ ఉండేది.. నేడు అక్కడా ఇక్కడా అని ఏమీ లేదు. కోతులు అడవులను వదిలి జనాల మీద పడుతున్నాయి.. వానరుడిని ఏమీ చేయలేని నరుడు.. నరకం చూస్తున్నాడు.. అధికారులు చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నాడు.. అయినా చర్యలు శూన్యం..

కోతి మూకల దాడులతో జనం బెంబేలు

- జనావాసంలోకి వానరసేన
- మనుషులు కనబడితే దాడి
- సామగ్రి ఎత్తుకెళ్లిపోతున్న వైనం
- ఉమ్మడి జిల్లాలో మరో కష్టం

ప్రత్తిపాడు/తునిరూరల్/ఏలేశ్వరం/దివాన్‌చెరువు/కూనవరం/ ఆత్రే యపురం/ సామర్లకోట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వనంలో ఉండాల్సిన కోతులు జనంలో సంచరిస్తుండడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. గుంపులు..గుంపులుగా చేరిన కోతులు రైతులకు ముచ్చెమటలు పట్టిస్తున్నాయి.ఊళ్లలోకి చొరబడి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి.ఇంటి పెరట్లోని మొక్కలన ధ్వంసం చేస్తున్నాయి. పంటలు, పండ్ల తోటలు, గృహాల్లోకి చొరబడుతున్నాయి. ఇళ్లలోకి చొరబడి అందినకాడికి నిత్యావసరాలను ఎత్తుకుపోతున్నాయి.

పాఠశాలలకు వెళ్లే చిన్నారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఇటీవల కాలంలో పలువురు వానర మూకల దాడిలో గాయపడి ఆస్పత్రులకు చికిత్స నిమిత్తం వెళ్లిన సంఘటనలు ఉన్నాయి. సామర్లకోటలో కోతులు, కొండము చ్చుల బెడద అధికంగానే ఉంది. సామర్లకోట మాండవ్య నారాయణస్వామి ఆలయం నుంచి భీమేశ్వరాలయం వరకూ ఉన్న రోడ్డు, వ్యవసాయ పరిశోధనా కేంద్రం రోడ్డులోనూ కోతుల బెడద ఉంది. అన్నవరం, అంతర్వేది తదితర పర్యాటక ప్రాంతాల్లోనూ కోతుల దాడి అధికంగానే ఉంటుంది. పంచాయతీ, వ్యవసాయశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వీటి కట్టడికి చర్యలు శూన్యం. ఇప్పటికైనా అటవీ, పంచాయతీరాజ్ శాఖలు సంయుక్తంగా కోతులు పట్టుకుని అటవీ ప్రాంతాలకు తరలించాలని ప్రజలు కోరుతున్నారు.





సామర్లకోట .. అలమండలో

ఇక్కడే.. ఇబ్బంది

ప్రత్తిపాడు, తుని పట్టణానికి ఆనుకుని ఉన్న గ్రామీణ ప్రాం తాలతో పాటు తుని మండలంలో తేటగుంట, గవరపేట, వెంకటాపురం, హంసవరం తదితర గ్రామాల్లో వానరమూక ప్రజలను బెంబేలెత్తిస్తోంది. ఏలేశ్వరం నగర పంచాయతీ పరిధిలో కోతులు బెడద అధికంగా ఉంది. రాజానగరం మండలంలోని శ్రీకృష్ణపట్నం, శ్రీరాంపురం, రఘునాథపురం, పుణ్యక్షేత్రం, తుంగపాడు గ్రామాల్లో పండ్ల తోటలు అధికం. వాతావరణం అనుకూలించినా వానర మూకల వల్ల రైతులు నష్టాలను ఎదుర్కొంటున్నారు.లాలాచెరువు హౌసింగ్‌బోర్డు కాలనీ, దివాన్‌చెరువు తదితర జనావాస ప్రాంతాల్లో కోతుల బెడద అధికంగా ఉంది. కూనవరంలో కోతుల కారణంగా జనం రోడ్లపై తిరగాలంటనే భయపడుతున్నారు.ఆత్రేయపురం మండలం బొబ్బ ర్లంక, ధవళేశ్వరం బ్యారేజీపై కోతులు కాచుకుని అప్పుడప్పుడు వాహన దారులపై దాడులకు దిగుతున్నాయి. ఏలేశ్వరం నగర పంచాయతీ పరిధిలో 20వ వార్డుల్లో ప్రజలు ప్రత్యక్షంగా పరోక్షంగా ఇబ్బందులకు గురవుతున్నారు. వీటిని కొట్ట లేరు.. అలాగని పట్టుకోరు.. ఈ మూగజీవాలతో పట్టణంలో 40వేల జనాభాకు నిత్యం నరకం కనిపిస్తోంది. ప్రస్తుతం ఉన్న కఠినమైన చట్టాలతో వీటి సమస్య నానాటికీ ఇబ్బందికరంగా మారుతోంది.

ఒకే విద్యార్థి.. ఒకే టీచరు!

- సామర్లకోట మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ఇది పరిస్థితి

(ఆంధ్రజ్యోతి-సామర్లకోట)

ఇది కాకినాడ జిల్లా సామర్లకోట మున్సి పాల్టీ పరిధిలోని కోదండరామపురం మున్సిపల్ ప్రాథమిక పాఠశాల.. ఇక్కడ ఒకే టీచర్ విధులు నిర్వహిస్తుండగా ఒకే విద్యార్థి విద్యాభ్యాసం చేస్తున్నారు. ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నా, లక్షలాది రూపాయల మేర ఉపాధ్యాయులకు వేతనాల రూపంలో చెల్లిస్తున్నా సర్కారు బడుల వైపు తల్లిదండ్రులు మొగ్గు చూపడం లేదు. చిన్నారుల హాజరు తక్కువగా ఉండడానికి ఇదొక కారణమైతే పాఠశాలల విలీనం మరొక కారణంగా తెలుస్తోంది. మండలానికి ఇద్దరు ఎంఈవోలు, సీఆర్పీ వ్యవస్థలు ఉన్నా చిన్నారులను ప్రభుత్వపాఠశాలల వైపు రప్పించలేకపోతున్నారని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. జిల్లా కేంద్రమైన కాకినాడకు 15 కిలోమీటర్ల దూరంలో ఈ పాఠశాల ఉంది. ఇక్కడ ఒకే విద్యార్థి కీర్తి, ఒకే టీచరు గౌతమి మాత్రమే ఉన్నారు. ఈ పాఠశాలకు మధ్యాహ్న భోజన పథకం కూడా అమలు కావడం లేదు.



సామర్లకోటలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థిని, టీచరు

జీలుగు నీరా నుంచి బెల్లం తయారీ

- అధిక లాభాలు పొందొచ్చు
- పందిరిమామిడి ఉద్యాన పరిశోధనా క్షేత్రం శాస్త్రవేత్త డాక్టర్ వెంగయ్య
- మోతుగూడెంలో జీలుగుకల్లు సేకరణదారులకు శిక్షణ



జీలుగు నీరా నుంచి బెల్లం తయారీపై శిక్షణ ఇస్తున్న వెంగయ్య

మోతుగూడెం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కొండలపై సహజ సిద్ధంగా పెరిగిన జీలుగు చెట్ల నుంచి నీరా సేకరించి బెల్లం తయారు చేయడం ద్వారా మంచి ఆదాయాన్ని పొందవచ్చని సీనియర్ శాస్త్రవేత్త, పందిరిమామిడి ఉద్యాన పరిశోధనా క్షేత్రం శాస్త్రవేత్త డాక్టర్ పీసీ వెంగయ్య తెలిపారు. జీలుగు బెల్లం తయారీపై ఆయన శిక్షణ ఇచ్చారు. చింతూరు మండలం మోతుగూడెం ఎంసీడీ క్యాంప్‌లో ఆషా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి వెంగయ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

పాత పద్ధతిలో సేకరిస్తున్న జీలుగు కల్లుకు బదులుగా కొత్త పద్ధతిలో పరిశుభ్రంగా నీరా ఎలా సేకరించాలి.. తద్వారా బెల్లం ఎలా తయారు చేయొచ్చు అనే అంశాలపై ఆయన శిక్షణలో పాల్గొన్న అభ్యర్థులకు నేర్పించారు. ఈ సందర్భంగా వెంగయ్య మాట్లాడుతూ ఒక్కొక్క చెట్టునుంచి సీజన్ మొత్తంలో కనీసం 100 రోజులు నీరా సేకరించి నా రోజుకు 30 లీటర్ల చొప్పున 3000 లీటర్ల ఉత్పత్తి చేయవచ్చునని అన్నారు. శుభ్రంగా నీరా సేకరించి బెల్లం తయారు చేస్తే తామే కొనుగోలు చేస్తా మని తెలిపారు. ఉత్సాహం ఉన్న కొంతమందిని గుర్తించి వారికి తగిన పనిముట్లు, పరికరాలను తమ ఉద్యాన పరిశోధన కేంద్రం తర ఫున ఉచితంగా అందిస్తామని, మరికొన్ని శిక్షణలు ఇప్పించి ఈ ప్రాంతంలోని యువతకు ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమానికి తడికవాగు, ఇంతలూరు వాగు, ఒడియా క్యాంప్, సింధువాడ, గంగవాడ, శాంతినగరం గ్రామాల నుంచి 24 మంది జీలుగు కల్లు సేకరణదారులు పాల్గొన్నారు. జీలుగు నీరాతో బెల్లం చేసి అమ్మితే ఉపాధి పొందవచ్చునని ఆషా సంస్థ కార్యదర్శి శ్రీసయ్యద్ సుభాని అన్నారు.

అత్యాధునిక వైద్యంపై
అవగాహన పెంచుకోవాలి

- ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజియోథెరపిస్ట్ సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ సురేష్‌బాబురెడ్డి



కిమ్స్‌లో ఫిజియోథెరపీపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సురేష్‌బాబురెడ్డి

అమలాపురంరూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఫిజియోథెరపీలో అత్యాధునిక వైద్య విధానాలు ఎన్నో అందుబాటులోకి వచ్చాయని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజియోథెరపిస్ట్ సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ సురేష్‌బాబురెడ్డి పేర్కొన్నారు. అమలాపురం కిమ్స్ వైద్య కళాశాలలో రెండురోజులపాటు సదర్నా ఫిజియోస్ వార్షిక పరిశోధన-సాంస్కృతిక మహాసభ-2025 శనివారంతో విజయవంతంగా ముగిసింది. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన సుమారు 800 మంది ఫిజియోథెరపిస్టులు, ఫిజియోథెరపీ విద్యార్థులు మహాసభల్లో పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ సురేష్‌బాబు బేసిక్ ఎమర్జెన్సీ ప్రొసీజర్స్, టేపింగ్ టెక్నిక్, మాన్యువల్ థెరపీ, తదితర అంశాలపై వర్కుషాపులో విద్యార్థులకు వివరించారు. వీటితో పాటు దంతవైద్య, ఫిజియోథెరపీ రంగాల్లో నిపుణులు పీఎంఏలు నిర్వహించారు. ప్రముఖ సినీనటి శ్రీదేవి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. శ్రీదేవితో కలసి విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కిమ్స్ డీన్ డాక్టర్ ఆనంద్ ఆచార్య, ఉపాధ్యక్షుడు మోహన్ రాజు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పి. సుబ్బారావు ఆహుతులను సత్కరించారు. అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన వైద్యుల బృందాన్ని కిమ్స్ చైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు), ఎండీ కె.రవికిరణ్‌వర్మ, ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ అశోక్‌చక్రవర్తి అభినందించారు.

కూలీల చేతిలో రక్తపింజర హతం



ఆర్.ఏనుగుపల్లిలో వరి చేల్లో రక్తపింజరను చంపిన కూలీలు

పి.గన్నవరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం మండలం ఆర్.ఏనుగుపల్లిలో శనివారం వరి చేల్లో కూలీలు రక్తపింజరను హతమార్చారు. గ్రామంలోని ఏటిగట్టు దిగువున పనలు కడుతుండగా రక్తపింజర కనిపించింది. అత్యంత ప్రమాదకరమైన విషసర్పం కావడంతో కూలీలు కర్రలతో కొట్టి చంపారు. గత కొన్ని రోజులుగా పరిసర ప్రాంతాల్లో రక్త పింజర పాములు ఎక్కువగా కనిపించడంతో స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు.

అమలాపురం రూరల్: అమలాపురం మండలం సమనస గ్రామానికి చెందిన మంచిగంటి మణికంఠ స్వగృహం వద్ద నిర్వహిస్తున్న డెయిరీఫామ్‌లో రక్తపింజర కనిపించింది. నెల రోజుల క్రితం కనిపించగా, దాని ఆచూకీ కోసం యజమాని వెతికాడు. కానీ కనిపించకపోవడంతో రెండు పర్యాయాలు స్నేక్ క్యాచర్ జంపన రమేష్‌వర్మకు సమాచారం అందించారు. కగా, ఎట్టకేలకు శనివారం రాత్రి కన్నం నుంచి బయటకు రావడంతో వర్మకు సమాచారం అందించడంతో హుటాహుటిన ఆయన అక్కడకి చేరకుని అత్యంత ప్రమాదకరమైన రక్తపింజరని పట్టుకుని బంధించాడు. దీంతో గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు.



సమనసలో ఓ డబ్బాలో బంధించిన పాముతో స్నేక్ క్యాచర్

ఆధ్యాత్మికభావం అవసరం

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి సుభాష్
- అన్నవరం సత్యదేవుడి సన్నిధిలో పూజలు

అన్నవరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరికీ ఆధ్యాత్మికభావం అవసరమని రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. శనివారం ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం సత్యదేవుడ్ని దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ ఈవో సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు.

నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళం

దేవస్థానంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యన్నదాన పథకానికి శనివారం ఒక దాత రూ. లక్ష విరాళంగా సమర్పించారు. సత్తుపల్లికి చెందిన పి.కృష్ణారావు ఈ మొత్తాన్ని ఆలయ ఈవో సుబ్బారావుకు అందజేయగా దాతను ఆయన అభినందించి వారికి స్వామి వారి ప్రసాదం, ప్రత్యేక దర్శనం కల్పించారు.



సత్యదేవుడి దర్శనానంతరం మంత్రి సుభాష్

వేడుకగా ప్రాకార సేవ

రత్నగిరి వాసుడైన సత్యదేవుడికి శనివారం ప్రాకారసేవ వేడుకగా జరిగింది. ఉదయం 9 గంటలకు ప్రధానాలయం నుంచి స్వామి, అమ్మవార్లను తిరుచ్చివాహనంపై ఆశీనులు గావించి తూర్పురాజగోపురం వద్దకు తోడ్కొనివచ్చారు .అక్కడ ప్రత్యేక పూజలు అనంతరం భక్తుల గోవిందనామస్మరణలు, పండితుల వేదమంత్రోచ్చరణల నడుమ ముమ్మారు ప్రదక్షణ గావించారు. కార్యక్రమం అనంతరం హారతులిచ్చి ప్రదానాలయానికి తీసుకెళ్లారు.

భక్తజన వాస గోవిందా

- వాడపల్లి వెంకన్న ఆలయానికి పోటెత్తిన జనం
- స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.56,75,591 లక్షలు

ఆత్రేయపురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం గోవిందనామస్మరణతో మార్మోగింది. వేకుమజామునే స్వామివారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మీహోమం, బాలభోగం, తదితర కార్యక్రమాలను శాస్రోక్తంగా నిర్వహించారు. అనంతరం స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో వేదపండితులు అలంకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తీరువీధులలో ఏడు ప్రదక్షణలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే ఆలయం ఎదురుగా ఉన్న దీపారాధన మండపంలో మహిళలు దీపాలంకరణ చేశారు. బస్టాండ్ వద్ద మహిళల సందడి నెలకొంది. కొత్త వంతెన నుంచి ఆలయం వరకు బ్యాటరీ వాహనాల ద్వారా భక్తులను ఆలయానికి తీసుకువచ్చారు. 104 వైద్యసిబ్బంది సేవలు అందించారు. ఆలయ చైర్మన్ ముదునూరి వెంకట్రాజు ఆలయంలో పర్యవేక్షించారు. రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. భక్తజన గోవిందనామస్మరణతో ఆలయం మార్మోగింది. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ. 56,75,591 లక్షలు లభించినట్టు ఉప కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.



ఆలయంలో భక్తుల రద్దీ

బాలబాలాజీకి విశేష పూజలు

మామిడికుదురు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీస్వామికి శనివారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం దేవస్థానం భక్తులతో పోటెత్తింది. వేకువజామునే అర్చకులు వేదమంత్రోచ్చారణలతో సుప్రభాత సేవ నిర్వహించి ఘనంగా తొలి హారతి ఇవ్వగా, స్వీకరించిన భక్తులు తన్మయత్వం చెందారు. కొత్త పాత ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్వామివారిని శనివారం 5200 మంది భక్తులు దర్శించుకున్నారు. అన్నప్రసాదం ట్రస్టులో దాదాపు మూడు వేల మంది అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ ఆర్జిత సేవల టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ. 2,94,060 ఆదాయంగా సమకూరిందని సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే నిత్యాన్నదాన పథకానికి రాజమహేంద్రవరానికి చెందిన బి.విజయ్‌శంకర్-సుజాత దంపతులు రూ.10,009 విరాళంగా అందించారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా ఏసీ, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.



కొలువుదీరిన బాలబాలాజీ స్వామి

సిద్ధి వినాయకుడి సన్నిధిలో సమాచారశాఖ కమిషనర్



అయినవిల్లిలో సునీల్‌కుమార్‌కు స్వాగతం పలుకుతున్న అర్చకులు, అధికారులు

అయినవిల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ (విజయవాడ) చావలి సునీల్‌కుమార్ శనివారం కుటుంబ సమేతంగా అయినవిల్లి శ్రీసిద్ధి వినాయకస్వామిని దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. తొలుత వీరికి ఆలయ మర్యాదలతో అర్చకులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం పండితులు వేదాశీర్వచనం అందజేసి శేషవస్త్రంతో సత్కరించారు. తర్వాత విఘ్నేశ్వరస్వామి చిత్రపటం, ప్రసాదమిచ్చారు.

సామర్లకోట: సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ సునీల్‌కుమార్ శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమరావతి నుంచి జిల్లా పర్యటనార్థం విచ్చేశారు. ఆయనకు ఆలయ ఈవో బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి సుందరరామయ్య (రాంబాబు), వెంకన్న, అంజిబాబు, తదితరుల వేదమంత్రోచ్చారణల మధ్య సాదరంగా స్వాగతం పలికారు. ముందుగా కాలభైరవస్వామిని దర్శించి ఆలయ ఆవరణలోని అన్ని ఉపాలయాల దేవతామూర్తులను దర్శించారు. తర్వాత భీమేశ్వరస్వామికి విశేష అభిషేక పూజలు, బాలాత్రిపుర సుందరి అమ్మవారికి విశేష పుష్పార్చన పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ సునీల్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసినవారిలో కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు, సామర్లకోట తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ వై. శ్రీనివాసు, పెద్దాపురం ఎస్‌ఐ మౌనిక, సామర్లకోట వీఆర్వోలు నలజర్ల మురళీకృష్ణ, నూతలపాటి లోవరాజు, తదితరులు ఉన్నారు. అనంతరం ద్రాక్షారామకు ప్రత్యేక వాహనంలో తరలివెళ్లారు. ఈయన తోపాటు అధికారులు, తదితరులు ఉన్నారు.

ఉమ్మడి జిల్లా అండర్ - 17 బాలుర క్రికెట్ జట్టు ఎంపిక

అంబాజీపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అంబాజీపేట జిల్లా పరిషత్ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో శనివారం జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ కె.ఈశ్వరరావు, ఎ.రమాదేవి పర్యవేక్షణలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అండర్-17 బాలుర క్రికెట్ జట్టు ఎంపిక చేశారు. ఉమ్మడి జిల్లా నుంచి సుమారు 250 మంది క్రీడాకారులు పాల్గొనగా వీరిలో ఆల్‌రౌండర్, బ్యాట్స్‌మెన్, బౌలర్, కీపర్ సామర్థ్యాలను కలిగిన 16 మంది క్రికెట్ జట్టు ఎంపిక చేయడం జరిగిందన్నారు. అలాగే వీరితో పాటు మరో 8 మందిని స్టాండ్ బై సెలక్ట్ చేయడం జరిగిందన్నారు. ఈ నెల 15 నుంచి విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌లో ఈ జట్టు పాల్గొంటుందని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సాయిరాం, సెలక్టర్లు ఆర్.నాగకుమార్, తోట రవి, పి. శ్రీనివాస్, సీహెచ్ శేఖర్, ధర్మశేఖర్, పవన్ కిషోర్, శ్రీనివాస్, పీడీ కుంపట్ల ఆదిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన క్రికెట్ జట్టు

21 నుంచి జేఎన్టీయూకేలో రాష్ట్రస్థాయి
చెకుముకి సైన్స్ సంబరాలు



సంబరాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కాకినాడ సిటీ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి 23 వరకు కాకినాడ జేఎన్టీయూకేలో రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్‌సంబరాలు నిర్వహిస్తున్నట్లు జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తెలిపారు. శనివారం కాకినాడ యూటీఎఫ్ హోంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక ప్రజల కోసం సైన్స్, ప్రగతి కోసం సైన్స్ అంటూ శాస్త్ర విజ్ఞాన ప్రచారం చేస్తూ చైతన్యపరుస్తోందన్నారు. రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ సంబరాల్లో 200మంది విద్యార్థులు వారి తల్లిదండ్రులు, 200మంది ఉపాధ్యాయులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.త్రిమూర్తులు, జి.మురళీధర్, జిల్లా అధ్యక్షుడు కేఎంఎంఆర్ ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి జీఎస్ వర్మ, జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ ఎన్. సూర్యనారాయణ, ఎం.రామకృష్ణ, జిల్లా గౌరవా ధ్యక్షుడు వి.సత్యనారాయణరెడ్డి, నగర అధ్యక్షుడు డాక్టర్ ఆలపాటి శ్రీనివాస్, పెన్షనర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్తిరాజు, అయితా బత్తుల రామేశ్వరరావు, వర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ అబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

10 నుంచి అంతర విశ్వవిద్యాలయాల
పురుషుల వాలీబాల్ పోటీలు

జేఎన్టీయూకే, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూ ఆధ్వర్యంలో సౌత్‌జోన్ అంతర విశ్వవిద్యాలయాల పురుషుల వాలీబాల్ పోటీలు ఈనెల 10 నుంచి 14 వరకూ జరుగనున్నాయని రిజిస్ట్రార్ ఆర్.శ్రీనివాసరావు తెలిపారు. ఈ టోర్నమెంట్లో సుమారుగా 138 జట్లు పాల్గొంటున్నాయన్నారు. ఈ పోటీలను 4 పూల్స్‌గా విభజించామన్నారు. పూల్ ఏ, బీ పోటీలు జేఎన్టీయూ మైదానంలోనూ.. పూల్ సీ పోటీలు అచ్చంపేటలోని రాజీవ్ గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ క్యాంపస్‌లోనూ... పూల్ డీలోని జట్లకు సంబంధించిన పోటీలు సూరంపాలెంలోని ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలోనూ జరుగతాయని తెలిపారు. 6రాష్ట్రాల నుంచి 2 వేల మంది క్రీడాకారులు, 250 మంది కోచ్‌లు, మేనేజర్లు, 100 మంది వరకూ వాలీబాల్ టెక్నికల్ అఫీషియల్స్ పాల్గొంటున్నారన్నారు. ఈ పోటీల్లో మొదటి 4 స్థానాల్లో నిలిచిన జట్లు అఖిల భారతస్థాయి పోటీలకు అర్హత సాధిస్తాయని ఆయన తెలిపారు.

10 వరకూ ఆన్‌లైన్‌లో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్

జేఎన్టీయూకే రిజిస్ట్రార్ శ్రీనివాసరావు

జేఎన్టీయూకే, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూకే ఆధ్వర్యంలో నాణ్యత హామీ, సంస్థ ప్రతిష్ఠ, అక్రిడిటేషన్ ర్యాంకింగ్స్‌పై దృష్టి అనే అంశంపై నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ఈనెల 10 వరకూ ఆన్‌లైన్‌లో కొనసాగుతుందని రిజిస్ట్రార్ ఆర్.శ్రీనివాసరావు తెలిపారు. దీనికి చైర్మన్‌గా సివిల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు, ఈసీఈ అసోసియేట్ ప్రొఫెసర్ లీలాకుమారి సమన్వయకర్తగానూ వ్యవహరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో వర్సిటీ అనుబంధ, క్యాంపస్ కళాశాలల నుంచి 348మంది అధ్యాపకులు పాల్గొంటున్నారన్నారు. వరంగల్, రూర్కెలా ఎన్ఐటీలు, సూరత్కల్ ఎన్ఐటీకే, ఓయూ, విట్ వంటిసంస్థల నిపుణులు, ఎన్‌బీఏ, న్యాక్ అక్రిడిటేషన్, ఎన్ఐఆర్ఎఫ్, పరిశోధనా సంస్కృతి, విద్యాప్రావీణ్యత వంటి అంశాలపై సాంకేతిక సెషన్లను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 1న ప్రొఫెసర్ రమేష్, 2న ప్రొఫెసర్ శరత్‌బాబు, 3న వేణుగోపాల్, 4న ఏసురత్నం, 5న శర్మ నిరంతర నాణ్యతాభివృద్ధి, కోర్సు ఫైల్స్ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. శనివారం ప్రొఫెసర్ ఉగ్రసేన్‌సుమన్ సార్ ప్రమాణాల డాక్యుమెంటేషన్‌పై వివరించారు. ఈ కార్యక్రమం అధ్యాపకుల్లో నైపుణ్యాభివృద్ధికి సంస్థల నాణ్యత పెంచడంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.

రేపటి నుంచి నన్నయలో పీజీ స్పాట్ అడ్మిషన్లు

ఉపకులపతి ఆచార్య ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో మూడు క్యాంపస్‌లలో పీజీ కోర్సులకు ఈ నెల 8నుంచి 12 వరకూ స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలను విశ్వవిద్యాలయంలో శనివారం ఆమె తెలియజేస్తూ నన్నయ విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం, కాకినాడ, తాడేపల్లిగూడెం క్యాంపస్‌లలో పీజీ కోర్సులకు రాజమహేంద్రవరంలో క్యాంపస్‌లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తామని చెప్పారు. ఎంఏ, ఎంకామ్, ఎంపీఈడీ, ఎంఎస్సీ కోర్సులకు స్పాట్ అడ్మిషన్‌లు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఏపీ పీజీసెట్‌లో అర్హత సాధించలేని వారు, సెట్‌కు హాజరు కాని అభ్యర్థులు పీజీ స్పాట్ అడ్మిషన్లలో ప్రవేశం పొందవచ్చన్నారు. సైన్స్ కోర్సులకు 8,9 తేదీల్లోను, ఆర్ట్స్ కోర్సులకు 10,11 తేదీల్లోను, ఏమైనా సందేహాలు, పెండింగ్‌లో ఉన్న సర్టిఫికెట్లు కోసం 12న స్పాట్ అడ్మిషన్‌లు జరుగుతాయని తెలిపారు. నన్నయ రాజమహేంద్రవరం క్యాంపస్‌లో డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ జరిగే ఈ ప్రక్రియను డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ఎన్.సజనారాజ్ పర్యవేక్షిస్తారన్నారు. ఏపీ పీజీసెట్ 2025లో అర్హత సాధించిన అభ్యర్థులు రూ.500, పీజీ సెట్ అర్హత లేని వారు, పీజీ సెట్‌కు హాజరు కాని వారు రూ.800 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని వీసీ సూచించారు.

రేపు కాకినాడలో జాబ్ మేళా

కాకినాడ సిటీ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వికాస ఆధ్వర్యంలో ఈ నెల 8న కాకినాడలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. ఈ మేళాలో పలు కంపెనీల్లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఈ ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లమో, బీటెక్ ఉత్తీర్ణులైన 40ఏళ్ల లోపు అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి గల వారు సోమవారం ఉదయం 9గంటలకు సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయం వద్దకు హాజరు కావాలన్నారు. వివరాలకు 77993 76222 నెంబరును సంప్రదించాలన్నారు.


ఏపీలో బీజేపీ బలపడదు

మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్

రాజమహేంద్రవరం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీది బయోలాజికల్ పుట్టుక కాదు. తాను దేవుడనని మోదీనే స్వయంగా చెప్పుకుంటున్నారు. రాష్ట్రంలోని రెండు పార్టీలు మోదీకి అనుకూలంగా మారిపోయాయని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ ఎద్దేవా చేశారు. రాజమహేంద్రవరంలోని ధర్మంచర హాల్‌లో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. డిసెంబరు 6న రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ వర్ధంతి కానీ బాబ్రీ మసీదును కూల్చి రాజ్యాంగాన్ని తుంగలో తొక్కిన రోజు కూడా ఇదే. ఏ ప్రభుత్వానికైనా అపరిమిత హక్కులు కల్పించి ప్రజలు మౌనంగా ఉంటే ఆదేశం పతనమవుతుందని ఆనాడే అంబేడ్కర్ చెప్పారని గుర్తు చేశారు. ఇండియా-పాకిస్తాన్ మధ్య తాను రాజీ చేశానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెబుతుంటే మోదీ కనీసం స్పందించకపోవడం ఏంటని ఆయన ప్రశ్నించారు. హిందుత్వం మతం కాదు. అదో సంస్కృతి. సనాతన ధర్మం. అది ఎప్పటికీ పోదు. మనది సెక్యులర్ దేశమని చెప్పారు. పాకిస్థాన్ గురించి భయపడాల్సిన అవసరం లేదని స్పష్టంచేశారు. రాజకీయ పరమైన యుద్ధాలను మతపరంగా మార్చి, ప్రజల మధ్య గొడవలు పెడుతున్నారన్నారు. నెహ్రూను దుర్మార్గుడిగా చిత్రీకరిస్తున్న మోదీకి చరిత్ర తెలియదన్నారు. కాంగ్రెస్ ఉనికి లేకుండా చేయడమే బీజేపీ లక్ష్యంగా మాట్లాడుతోందని తెలిపారు.ఆంధ్రలో ఎప్పటికీ బీజేపీ బలపడలేదని స్పష్టం చేశారు. అమాయక భారతీయులను చంపేస్తున్న టెర్రరిస్టులను కాల్చిపడేయాలన్నారు. కోనసీమలో దెబ్బతిన్న కొబ్బరిచెట్ల పరిస్థితిని గురించి చెప్పే సమయంలో తెలంగాణ దిష్టితగిలిందని పవన్ కల్యాణ్ అనడం సరికాదన్నారు. ప్రపంచ నలుమూలల నుంచి రాష్ట్రానికి పెట్టుబడులు తెస్తున్న చంద్రబాబు, మాజీ ముఖ్యమంత్రి జగన్ తమ వ్యాపార సంస్థలను ఆంధ్రకు ఎందుకు తేవడం లేదని ప్రశ్నించారు.

ముందుగా మేల్కొంటే..
ముప్పుండదు!

- స్క్రబ్ టైఫస్ ప్రాణాంతకం కాదు
- దీర్ఘకాలిక రోగులకు వైద్యుల పర్యవేక్షణ తప్పనిసరి
- కంగారు వద్దంటున్న వైద్యులు



జీజీహెచ్(కాకినాడ), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్క్రబ్ టైఫస్ అనేది ఒక రకమైన జ్వరం. అది నల్లివంటి పురుగు కుట్టిన పిదప ఓరియెన్షియా సుస్ట్ సుగుమాషీ అనే బ్యాక్టీరియా ద్వారా మనిషిలో సంక్రమిస్తుంది. తొలుత జ్వరం వచ్చి పిదప దద్దుర్లతో కూడిన నల్లటి మచ్చ ఏర్పడుతుంది. దానిని ఎస్కార్ అంటారు. ఈ లక్షణాలను గుర్తించిన వెంటనే దగ్గరలోని పీహెచ్‌సీ లేదా యూపీహెచ్‌సీ లేదా ఏరియా ఆసుపత్రి లేదా జిల్లా ఆసుపత్రికి వెళితే తక్షణం వైద్యం అందించడం ద్వారా ఈ స్క్రబ్ టైఫస్‌ను తరిమి వేయవచ్చు. మధుమేహం, రక్తపోటు, హృద్రోగం, క్షయ తదితర దీర్ఘకాలిక వ్యాధులున్నవారు అప్రమత్తంగా ఉండి స్క్రబ్ టైఫస్ లక్షణాలు కనబడితే వెంటనే అర్హుడైన వైద్యుడిని సంప్రదించాలి. తద్వారా అటువంటి వారికి వైద్యులు డాక్సీ సైక్లిన్, ఎరిత్రోమైసిన్ తదితర ఔషధాల ద్వారా వ్యాధిని నియంత్రిస్తారు.

జీజీహెచ్‌లో 155 మందికి పాజిటివ్

ఇప్పటివరకు కాకినాడ జీజీహెచ్‌లోని వీఆర్‌డీఎల్ ల్యాబ్‌లో నిర్వహించిన వైద్య పరీక్షల్లో 155 మందికి స్క్రబ్ టైఫస్ పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. అనంతరం వారందరిని దపదఫాలుగా జీజీహెచ్‌లో వైద్యుల ప్రత్యేక పర్యవేక్షణలో చికిత్స అందించి డిశ్చార్జ్ చేయడం జరిగింది. గడిచిన నెల రోజులుగా కాకినాడ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జె.నరసింహనాయక్, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ ఇంజేటి ప్రభాకర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని పీహెచ్‌సీల పరిధిలోని గ్రామాలు, పాఠశాలలు, వసతిగృహాల్లో స్క్రబ్ టైఫస్ జ్వరాలపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహించి వ్యాధి లక్షణాలు, చికిత్సపై వివరించారు. అలాగే పీహెచ్‌సీ వైద్యాధికారులకు జూమ్ మీటింగ్ నిర్వహించి కేసులు వస్తే చికిత్స పద్ధతులపై వివరించారు.

అంటువ్యాధి కాదు



వ్యాధినిరోధక శక్తి బాగా ఉండి పూర్తి ఆరోగ్యవంతులుగా ఉన్నవారికి స్క్రబ్ టైఫస్ వ్యాధి ప్రాణాంతకం కాదు. వ్యాధి లక్షణాలు గుర్తించిన వెంటనే ఆసుపత్రికి తరలించి వైద్యం అందించి పూర్తిగా నియంత్రించవచ్చు. ఇది ఒకరి నుంచి మరొకరికి సంక్రమించే అంటువ్యాధి కాదు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలోను ఈ వ్యాధికి సంబంధించిన మందులు పూర్తి స్థాయిలో ఉన్నాయి. స్క్రబ్ టైఫస్ పట్ల ఎవరు ఆందోళన చెందవలసిన అవసరం లేదు. ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి స్వీయ పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రత అవసరం.

- డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నాయక్, కాకినాడ

'తూర్పు'లో కేసులు నమోదు కాలేదు

రాజమహేంద్రవరం అర్బన్: తూర్పుగోదావరి జిల్లాలో ఇప్పటి వరకూ స్క్రబ్ టైఫస్ కేసులు నమోదు కాలేదు. అప్రమత్తంగా ఉన్నాం, మందులు సిద్ధంగా ఉన్నాయి. జిల్లాలో అన్ని ఆసుపత్రుల్లో మలేరియా పరీక్షల నిమిత్తం 4,29,911 మందికి రక్తపరీక్షలు నిర్వహించగా ఎలాంటి పాజిటివ్ మలేరియా కేసులు నమోదు కాలేదు. 2,872 మందికి డెంగ్యూ పరీక్షలు చేయగా 32 మందికి పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. చికెన్ గునియా కేసులు కూడా నమోదు కాలేదు. జీజీహెచ్‌లో స్క్రబ్ టైఫస్ నిర్ధారణ కోసం ర్యాపిడ్ టెస్టింగ్ కిట్లు అందుబాటులో ఉంచారు. ప్రస్తుతం 20 స్క్రబ్ టైఫస్ నిర్ధారణ ర్యాపిడ్ కిట్లు సిద్ధం చేశారు.

- డీఎంహెచ్‌వో, డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, తూర్పుగోదావరి జిల్లా

ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం



అమలాపురం (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో స్క్రబ్ టైఫస్ వ్యాధిపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. జిల్లాలో 11 నెలల్లో 177 పరీక్షలు నిర్వహించగా 17 స్క్రబ్ టైఫస్ కేసులు నమోదయ్యాయి. వారందరికీ సకాలంలో వైద్య సేవలు అందించడంతో పూర్తిగా కోలుకున్నారు. నల్లిని పోలిన చిన్న కీటకం కుట్టడం వల్ల ఈ వ్యాధి వస్తుంది. శరీరంపై నల్లటి ఎస్కార్ మచ్చ ఏర్పడుతుంది. వారం, పది రోజుల తరువాత జ్వరం, చలి, వణుకు, తలనొప్పి, కండరాల నొప్పులు, జీర్ణ సమస్యలు, శ్వాస రూపంలో ఇన్ఫెక్షన్‌వస్తుంది. ఈ వ్యాధి బారిన పడిన వారికి సాధారణ అంటీబయాటిక్స్‌తో వ్యాధి నయమయ్యే అవకాశం ఉంది. సకాలంలో చికిత్స అందకపోతే కోమాలోకి వెళ్లే ప్రమాదం ఉంది. కాకినాడ వంటి ప్రధాన ఆసుపత్రిలో గల ల్యాబ్‌లో పరీక్షలు చేస్తున్నారు. అనుమానిత కేసులు గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ రావడం వల్ల వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి ముందస్తు నివారణ చర్యలు తీసుకుంటున్నాం.

- డీఎంహెచ్‌వో, ఎం.దుర్గారావుదొర, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

ప్రభుత్వ కళాశాల వద్ద విద్యార్థుల ఘర్షణ

పోలీసుల కౌన్సిలింగ్

పిఠాపురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద విద్యార్థుల మధ్య జరిగిన ఘర్షణ శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మెగా టీచర్ మీటింగ్ జరుగుతున్న సమయంలోనే కళాశాల బయట ఈ సంఘటన జరిగింది. ఇటీవల తరచూ విద్యార్థులు మధ్య వివాదాలు, ఘర్షణలు జరుగుతున్న నేపథ్యంలో ఘర్షణకు దిగిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో పట్టణ పోలీసుస్టేషన్ వద్ద కళాశాల అధ్యాపకుల సమక్షంలో సీఐ శ్రీనివాస్ సమావేశం నిర్వహించారు. విద్యార్థులు ఎటువంటి గొడవలు, ఘర్షణలకు దిగినా, అసాంఘిక కార్యకలాపాల్లో పాల్గొన్నా కఠినచర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. మళ్లీ ఇటువంటి సంఘటనలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని, దీని వల్ల భవిష్యత్తులో ఉద్యోగం పొందే అవకాశాలను కోల్పోతారని తెలిపారు. కౌన్సిలింగ్ అనంతరం ఘర్షణకు దిగిన విద్యార్థులను వారి తల్లిదండ్రులకు అప్పగించారు. సమావేశంలో ఎస్ఐ మణికుమార్ తదితరులున్నారు.



పిఠాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న సీఐ

భూపాలపట్నంలో వ్యక్తి హత్య?

దర్యాప్తు చేస్తున్న పోలీసులు



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు



అప్పన్న (ఫైల్)

కిర్లంపూడి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం భూపాలపట్నం గ్రామానికి చెందిన కాకర అప్పన్న(48)ను హత్య చేసినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. శుక్రవారం రాత్రి గ్రామంలోని మెయిన్ రోడ్డులో అప్పన్న అనుమానాస్పదంగా మృతిచెందాడు. అటుగా వెళ్లే ఆటో డ్రైవర్ చూసి పోలీసులకు సమాచారం అందించాడు. జగ్గంపేట, ప్రత్తిపాడు సీఐలు వైఆర్‌కె శ్రీనివాస్, వెంకట అప్పారావు, కిర్లంపూడి ఎస్ఐ సతీష్, జగ్గంపేట ఎస్ఐ రఘునాధరావు సంఘటన స్థలానికి చేరుకున్నారు. పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు.హత్య కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

గతంలో ఘర్షణ...

కాకర అప్పన్నకు గ్రామానికి కుళ్ల రాజబాబుకు 2024 సెప్టెంబరు 3న ఘర్షణ జరిగింది. తర్వాత గ్రామంలో కిల్లీకొట్టు వద్ద రాజబాబుపై అప్పారావు ఐరన్ రాడ్డుతో కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. అప్పట్లో అప్పారావుపై హత్యాయత్నం కేసు నమోదైంది. ఇంకా కోర్టులో నడుస్తోందని స్థానికులు తెలిపారు. ఇదిలా ఉండగా శుక్రవారం రాత్రి బహిర్భూమికి వెళ్లి వస్తున్న అప్పారావును రాజబాబు, మరికొందరు కలిసి కొట్టి చంపారని మృతుడి సోదరుడు కాకర రాజేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కిర్లంపూడి ఎస్ఐ సతీష్ తెలిపారు. పోలీసు జాగిలం ఘటనా స్థలం నుంచి నేరుగా కుళ్ల రాజబాబు ఇంటికెళ్లి ఆగింది. దీంతో రాజబాబు హత్య చేసి ఉంటాడని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

బైక్ ఢీకొని వ్యక్తి మృతి

మరొకరికి ఆసుపత్రిలో చికిత్స

తొండంగి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తొండంగి మండలం అద్దరిపేట పెట్రోల్ బంక్ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కుమ్మరి సుబ్బారావు(59) దుర్మరణం పాలైనట్టు పోలీసులు తెలిపారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం రాజీపేటకు చెందిన కుమ్మరి సుబ్బారావు, తన బంధువు నేమాల రామకృష్ణతో కలిసి ఉదయం ఈదటం గ్రామానికి మోటార్‌సైకిల్‌పై వెళ్లారు. మధ్యాహ్నం తిరిగి వస్తుండగా పెట్రోల్ బంక్ సమీపంలో వెనుక నుంచి వేగంగా వస్తున్న మరో మోటార్‌సైకిల్ బలంగా ఢీకొట్టింది. దీంతో సుబ్బారావు, రామకృష్ణలకు తీవ్ర గాయాలయ్యాయి. ఇద్దరినీ తుని ఏరియా ఆసుపత్రికి తరలించగా సుబ్బారావు మరణించినట్టు వైద్యులు ధ్రువీకరించారు. రామకృష్ణ చికిత్స పొందుతున్నాడు. మృతుడి కుమారుడు రాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తొండంగి పోలీసులు తెలిపారు.

పెద్దిపాలెంలో భారీ అగ్నిప్రమాదం

- మూడు తాటాకిళ్లు అగ్నికి ఆహుతి
- రూ.10 లక్షల ఆస్తినష్టం
- డాబా ఇల్లు పాక్షికంగా దగ్ధం



అగ్నిప్రమాదంలో దగ్ధమవుతున్న గృహాలు

ప్రత్తిపాడు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెంలో శనివారం తెల్లవారుజామున జరిగిన భారీ అగ్ని ప్రమాదంలో 3 తాటాకిళ్లు పూర్తిగా దగ్ధం కాగా ఒక డాబా ఇల్లు పాక్షికంగా దెబ్బతింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.10 లక్షల ఆస్తినష్టం వాటిల్లింది. ఆరు కుటుంబాల వారు నిరాశ్రయులయ్యారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. పెద్దిపాలెంలోని రాళ్ల అప్పారావు, రాళ్ల రాజు, రాళ్ల ఆనందరావులకు చెందిన తాటాకిళ్లకు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించి కాలి బూడిదయ్యాయి. ఈ ఘటనలో గ్యాస్ సిలిండర్ పేలడంతో సమీపంలో ఉన్న పిల్లి సూరిబాబు డాబా ఇల్లు పాక్షికంగా దెబ్బతింది.స్థానికుల సమాచారంతో ఎస్ఐ ఎస్.లక్ష్మీకాంతం అగ్నిమాపక సిబ్బందికి విషయం తెలియజేశారు. దీంతో ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు. ఈ ఘటనతో నాలుగు కుటుంబాలతో పాటు గుండు బుజ్జమ్మ, బొందలపు కాసులమ్మ కుటుంబాలు నిరాశ్రయులయ్యారు. ఇళ్లలోని బట్టలు,గృహోపకరణాలు, బైక్ కాలిబూడిదయ్యాయి. ప్రమాదంలో రూ.10 లక్షలు పైబడి ఆస్తినష్టం జరిగిందని బాధితులు తెలిపారు. కట్టుబట్టలతో మిగిలారు.బాధితులను ఎమ్మెల్యే సత్యప్రభ పరామర్శించి బియ్యం, దుస్తులు, కొంత ఆర్థిక సాయం అందజేశారు. జనసేన నాయకురాలు బొర్లపూడి క్రాంతి బాధిత కుటుంబానికి రూ.40 వేలు సాయం అందించారు. ఆమె వెంట జనసేన నాయకులు సూర్నీడి సురేష్, నల్లల రామకృష్ణ, దంతులూరి బోసురాజు తదితరులున్నారు. అలాగే సాయంత్రం నియోజకవర్గ వైసీపీ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు బాధితులను పరామర్శించి ఆర్థిక సాయం, నిత్యావసర సరుకులు అందించారు. అందజేశారు.



ప్రమాదంలో దగ్ధమైన ఇల్లు

వాహనం ఢీకొని వృద్ధుడి మృతి



మృతుడు చంద్రరావు

కరప, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒక వృద్ధుడు మృతిచెందినట్టు కరప పోలీసులు తెలిపారు. కాకినాడ రూరల్ మండలం పగడాలపేట గ్రామానికి చెందిన చోడిపల్లి చంద్రరావు(72) చేపల వేట సాగిస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. శుక్రవారం రాత్రి ఇంటి నుంచి చొల్లంగి బ్రిడ్జి వైపుకు వెళ్తుండగా ఉప్పలంక సరళ రైస్ మిల్లు ఎదుట గుర్తుతెలియని వాహనం ఢీకొని ఆగకుండా వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన చంద్రరావును అంబులెన్స్‌పై కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనపై మృతుడి కోడలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు కరప ఏఎస్ఐ సూరిబాబు తెలిపారు.

రాష్ట్ర థాంగ్టా పోటీలకు విద్యార్థినుల ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

బిక్కవోలు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ థాంగ్టా రాష్ట్ర స్థాయి పోటీలకు పందలపాక ఉన్నత పాఠశాల నుంచి నలుగురు విద్యార్థినిలు ఎంపికయ్యారని హెచ్ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి శనివారం తెలిపారు. అండర్-17 విభాగంలో జి.తేజసాయిశ్రీ, అండర్-19 విభాగంలో పి.గీతారమ్యశ్రీ, బి.సత్య ప్రసన్న, జి.క్రాంతి ఎంపికయ్యారన్నారు. వీరు ఈ నెల 7, 8 తేదీల్లో అనకాపల్లి జిల్లా పరవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. మార్షల్ ఆర్ట్స్ విభాగానికి చెందిన థాంగ్టా క్రీడకు ఎంపికైన విద్యార్థినులను, శిక్షణ ఇచ్చిన పీడీ యువరాజారెడ్డిని హెచ్ఎంతో పాటు ఎస్ఎంసీ చైర్మన్ కోనాల సత్తిరాజు, ఉపాధ్యాయులు అభినందించారు.

శృంగారవల్లభుడి దర్శనానికి పోటెత్తిన భక్తులు

పెద్దాపురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుపతి శృంగారవల్లభ స్వామిని అధిక సంఖ్యలో భక్తులు శనివారం దర్శించుకున్నారు. తెల్లవారుజాము నుంచే స్వామి దర్శనానికి బారులు తీరారు.ప్రత్యేక దర్శన టికెట్ల విక్రయం ద్వారా రూ.1,34,140, అన్నదాన విరాళాలు రూ.64,141, కేశఖండన ద్వారా రూ.5,640, తులాభారం రూ.500, లడ్డూ ప్రసాదం విక్రయం ద్వారా రూ.17,595 వెరసి రూ.2,22,016 ఆదాయం సమకూరినట్టు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు.ఆలయానికి వచ్చే భక్తులకు పులిహోర, అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. సుమారు 10 వేల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారన్నారు.

పశువులను కడుగుతుండగా ఫిట్స్..
కాలువలో పడి వ్యక్తి మృతి



మృతుడు సింహాచలం

ప్రత్తిపాడు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పశువులను కాలువలో కడుగుతుండగా ఫిట్స్ రావడంతో ఒక వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల వివరాల మేరకు.. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి గ్రామం దళితవాడకు చెందిన దొండపాటి సింహాచలం(42) శనివారం సాయంత్రం 5గంటల సమయంలో పశువులను రాచపల్లి అడ్డురోడ్డు వద్ద పుష్కర కాలువలోకి మళ్లించాడు. వాటిని కడుతుండగా సింహాచలానికి మూర్ఛ రావడంతో నీటిలో పడిపోయాడు. మునిగిపోయి కొట్టుకోవడాన్ని సమీపంలోని కూలీలు గమనించి ఒడ్డుకు తీసుకువచ్చి సపర్యలు చేశారు. ప్రత్తిపాడు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. సింహాచలం మృతిఓ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి

జీజీహెచ్‌లో కార్డియాలజిస్ట్ నియామకానికి కృషి

ఆసుపత్రి పరిశీలనలో మంత్రి సుభాష్



కాకినాడ జీజీహెచ్‌ను పరిశీలిస్తున్న మంత్రి సుభాష్

జీజీహెచ్(కాకినాడ), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌కు హృద్రోగుల తాకిడి అధికంగా ఉన్న నేపథ్యంలో పూర్తిస్థాయి కార్డియాలజిస్ట్ నియామకానికి కృషి చేస్తానని రాష్ట్ర కార్మికశాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. ఆయన శనివారం జీజీహెచ్‌లో సందర్శించి కార్డియాలజీ, జనరల్ సర్జరీ వార్డుల్లో చికిత్స పొందుతున్న పలువురిని పరామర్శించి వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రి నిర్వహణపై సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారిని అడిగి తెలుసుకున్నారు.ఆసుపత్రిలో వైద్య సిబ్బంది కొరత ఉందని ముఖ్యంగా గుండె వైద్య నిపుణులు లేక రోగులు ఇబ్బంది ప డుతున్నట్టు మంత్రి దృష్టికి తీసుకు రాగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లి కార్డియాలజిస్ట్ నియామకానికి కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మనాభన్ శ్రీనివాసన్, సీఎస్ఆర్ ఎంవో డాక్టర్ కోమలి, అడ్మినిస్ట్రేటర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

గోరింటలో చిరుక్షేత్ర ప్రదర్శన

పెద్దాపురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గోరింటలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో చిరుక్షేత్ర ప్రదర్శన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఏవో కొమ్మోజు సంజయ్‌కుమార్ మాట్లాడారు. వ్యవసాయంలో చిన్న ప్రయోగాత్మక క్షేత్రాలను ఏర్పాటు చేయడం, పంటల యాజమాన్య పద్ధతులు రైతులకు తెలియచేయడమే ప్రధాన ఉద్దేశ్యమన్నారు. ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త సీతారామాశర్మ, సుధీర్‌కుమార్ తదితరులు ఉన్నారు.

అంబేడ్కర్ చిరస్మరణీయుడు

రాజ్యాంగ నిర్మాతకు ఘనంగా నివాళులర్పించిన నాయకులు, అధికారులు

కాకినాడ సిటీ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగ నిర్మాత, సమ సమాజ అభివృద్ధికి అహర్నిశలు పాటుపడిన బాబాసాహెబ్ అంబేడ్కర్ చిరస్మరణీయుడని జిల్లా టీడీపీ నాయకులు పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 69వ వర్ధంతి సందర్భంగా శనివారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాసబాబా, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లాబత్తుల అప్పారావు, టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు, తుమ్మల రమేష్, పలివెల రవి, అంబటి చిన్న, చింతలపూడి రవి తదితరులు పాల్గొన్నారు. సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఆధ్వర్యంలో టీడీపీ కార్యాలయం, నగరంలో పలుచోట్ల అంబేడ్కర్ విగ్రహాలకు రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లాబత్తుల అప్పారావు, టీడీపీ నగర అధ్యక్ష ప్రధాన కార్యదర్శిలు మల్లిపూడి వీరు, తుమ్మల రమేష్, నాయకులు పలివెల రవి, అంబటి చిన్న పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బంగారు సత్యనారాయణ, పెదపూడి కుమార్, బుంగా నాగరాజు, పాలిక నాని, పొంగా బుజ్జి, సంగాని నాగూర్, రెడ్నం సత్తిబాబు, కర్నీడి వరప్రసాద్, కోలా ఎల్లారావు, డోకుబుర్ర రాజు, బత్తిన ఉమ పాల్గొన్నారు.

జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో.. అంబేడ్కర్ చిత్రపటానికి జిల్లా అధ్యక్షుడు మాదేపల్లి సత్యానందరావు, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పీసీసీ సభ్యుడు కుక్కల పోతురాజు యాదవ్ మృతికి 2 నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గాల పార్టీ కో ఆర్డినేటర్లు మలకల సూరిబాబు, పిల్లి సత్యలక్ష్మి చిన్న, మారోతి శివ గణేష్, జిల్లా నాయకులు మొయ్యేటి సూర్యప్రకాష్, దాట్ల గాంధీరాజు, దవులూరి ధనకోటి, తాళ్లూరి రాజు, కొల్లు వీరగణేష్, వత్సవాయి సత్యనారాయణరాజు, నవుడు గోవింద్ పాల్గొన్నారు.

కార్పొరేషన్(కాకినాడ): సమాజంలో అన్ని వర్గాలకు సమానత్వం కల్పించేందుకు అంబేడ్కర్ ఎంతో కృషిచేశారని కమిషనర్ ఎన్‌వివి సత్యనారాయణ పేర్కొన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్, అదనపు కమిషనర్ కెటి సుధాకర్‌తో కలిసి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. బాలాజీ చెరువు సెంటర్‌లో అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ కళాశాల హాస్టల్‌లో వార్డెన్ ఎం.ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు. రిటైర్డు ఇంజనీర్ పి.రామారావు, నూకరాజు, ఎస్ఎఫ్ఐ నాయకులు ఎం.గంగాసూరిబాబు అంబేడ్కర్‌విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు.

కాకినాడ రూరల్ (ఆంధ్రజ్యోతి): కాకినాడ పీఆర్ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాల్లో ఆర్ట్స్ విభాగం ఆధ్వర్యంలో మహాపరినిర్వాణ్ దినోత్సవం సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ఆంజనేయులు, అధ్యాపకులు పూలమాలవేసి నివాళులర్పించారు. కె.రాజమాణిక్యం, డాక్టర్ హరిరామ్‌ప్రసాద్, జయదేవ్, మానిటరింగ్ సెల్ అధికారులు, అధ్యాపకులు ఉన్నారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ చిరస్మరణీయుడని టీడీపీ నాయకులు అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, కంటే జగదీష్‌మోహన్(బాబు), ఏఎంసీ చైర్మన్ అందుగుల మణికుమారి పేర్కొన్నారు. టీడీపీ కార్యాలయం ఆవరణలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బలుసు శ్రీనివాసు, జయలక్ష్మి, జార్జిచక్రవర్తి, మెండెం సర్రయ్య, గొలితి సత్యనారాయణ, గుడాల శంకర్, కలవల బుజ్జి, జానకి రామారావు, దాడిశెట్టి సూరిసత్తి పాల్గొన్నారు. ఎంపీడీవో కార్యాల ఆవరణలో అంబేడ్కర్ విగ్రహానికి ఎంపీడీవో కరక హిమ మహేశ్వరి, ఎంపీపీ సత్తిబాబు నివాళులర్పించారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దారపురెడ్డి క్రాంతికుమార్ అన్నారు. స్థానిక మున్సిపల్ సెంటర్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించి మాట్లాడారు. భారత రాజ్యాంగంలో ఉన్న స్ఫూర్తిని మనం కాపాడడమే అంబేడ్కర్‌కు మనమిచ్చే నివాళి అన్నారు. సీఐటీయూ నేతలు గడిగట్ల సత్తిబాబు, పద్మ, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

పిఠాపురం (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయసాధనకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. మున్సిపల్ కార్యాలయం ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహానికి వర్మ, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు నూతాటి ప్రకాష్, సిద్ధాంతపు ప్రదీప్, అందుగుల సత్తిబాబు, బొజ్జా సతీష్, సూరాడ రాజు, సోము సత్యనారాయణ, పిల్లి చిన్నా, అల్లవరపు నగేష్, సూరవరపు సుబ్బారావు పాల్గొన్నారు. అంబేడ్కర్ రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పనిచేస్తున్నారని రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ దానం లాజర్‌బాబు, బీఎస్ రాజు తెలిపారు. రథాలపేట సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి జనసేన నాయకులతో కలిసి వారు నివాళులర్పించారు. జనసేన నాయకులు బాలిపల్లి రాంబాబు, రెడ్డెం జనార్ధన్, కొత్తపల్లి బుజ్జి, గోపి చంటిబాబు, పాలిక ప్రవీణ్‌కుమార్, ఆగంటి ప్రభాకరరావు, రాజు, వాసు, దంగేటి ఆదినారాయణ, రథాలపేట యూత్ తదితరులు ఉన్నారు.

గొల్లప్రోలు రూరల్ (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలపరిషత్ కార్యాలయ ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహానికి అధికారులు, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సెలట్‌రాజు, డిప్యూటీ ఎంపీడీవో విద్యాసాగర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండల ప్రజాపరిషత్ కార్యాలయ సిబ్బంది అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధి హామీ సిబ్బంది నివాళులర్పించారు.

కరప (ఆంధ్రజ్యోతి): కరపలో ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, అధికారులతో కలిసి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెనుగుదురులో బీజేపీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ పుట్టా వీరప్రసాద్‌గాంధీ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు.



కాకినాడ సిటీ: జిల్లా టీడీపీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి చిక్కాల, టీడీపీ నాయకులు



కార్పొరేషన్: అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కమిషనర్, ఇతర సిబ్బంది







పిఠాపురంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ, సామర్లకోట టీడీపీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు, గొల్లప్రోలులో నివాళులర్పిస్తున్న అధికారులు

నేడు కాకినాడలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

కాకినాడ సిటీ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : శ్రీ సూర్య ఐ కేర్ కంటి ఆసుపత్రి, ఏఎల్ఐ ఫౌండేషన్ సౌజన్యంతో స్థానిక వార్ఫ్‌రోడ్‌లోని పెగోడా మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు 36వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి నల్లూరి శ్రీనివాస్, తులసి తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే శిబిరాన్ని సద్వినియోగపరచుకోవాలని కోరారు.

నేడు కొత్తపల్లి మండల బడ్జెట్ సమావేశం

కొత్తపల్లి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండల ప్రజాపరిషత్ సర్వసభ్య, బడ్జెట్ సమావేశం ఆదివారం నిర్వహించనున్నట్టు డిప్యూటీ ఎంపీడీవో ఎన్.శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 10.30గంటలకు ఎంపీపీ కారే సుధాశ్రీనివాసరావు అధ్యక్షతన జరిగే సమావేశానికి మండల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరుకావాలని కోరారు.

28న భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీలు

పిఠాపురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం వేణుగోపాస్వామి దేవస్థానం ప్రాంగణంలో విశ్వ హైందవ పరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 28న భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దువ్వా వెంకటేశ్వరరావు, మణికుమార్ తెలిపారు. భగవద్గీత 1 అధ్యాయంపై అరు స్థాయిల్లో పోటీలు జరుగుతాయని చెప్పారు. విజేతలకు బహుమతులు అందిస్తామని తెలిపారు. భగవద్గీత ఒకటవ అధ్యాయం పుస్తకాల కోసం మణికుమార్‌ను 8978043226లో సంప్రదించాలని కోరారు.

పాఠశాలకు కంప్యూటర్, ప్రింటర్ బహూకరణ

కొత్తపల్లి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలో వాకతిప్పకు చెందిన పిట్టా సత్యనారాయణ జ్ఞాపకార్థం ఆయన కుమారులు, కుమార్తె రూ.22వేలు విలువైన కంప్యూటర్, ప్రింటర్‌ను వాకతిప్ప మండల పరిషత్ మోడల్ పాఠశాలకు బహూకరించారు. దాతలు సురేష్, వెంకటేష్, రమేష్, బుజ్జిలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అప్పారావు, ఉమామహేశ్వరరావు, వీరబాబు, దుర్గారాణి ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.



కంప్యూటర్, ప్రింటర్ బహూకరిస్తున్న దాతలు

వ్యాపార అవకాశాలను వినియోగించుకోండి

కార్పొరేషన్(కాకినాడ), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఓల్డ్ మీ సేవా భవన్‌లో ఏఎల్ఈఏపీ ఆధ్వర్యంలో ఇంటికొక వ్యాపారవేత్త లక్ష్యంగా శనివారం బీడీఎస్ సర్వీస్ ప్రొవైడర్ల ఎంపిక కార్యక్రమం ప్రారంభమైంది. మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ బి.ప్రియంవద, డిఐసి ఏడీఈ విజయ్‌కుమార్, ఏఎల్ఈఏపీ రీజనల్ మేనేజర్ సునీత, మెప్మా అధికారులు పాల్గొన్నారు. మెప్మా పీడీ ప్రియంవద మాట్లాడుతూ మహిళలు, యువత వ్యాపార అవకాశాలను వినియోగించుకోవాలన్నారు. ఏఎల్ఈఏపీ ద్వారా పారిశ్రామిక శిక్షణలు, ఎంఎస్ఎంఈ ద్వారా సబ్సిడీ, జీఈఎం పోర్టల్, రిజిస్ట్రేషన్ వంటి అవకాశాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సీఎంఎం వెంకటరాజు, ఇతర అధికారులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మెప్మా పీడీ

ఆనూరులో రైతుకూలీ సంఘం నేతల ఆందోళన

పెద్దాపురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆనూరులో రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఆందోళన నిర్వహించారు. తమ సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 8న చేపట్టనున్న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు కోరారు. ఆనూరులో అల్లూరి సీతారామరాజు నగర్‌లో నివసిస్తున్న దళితుల పట్ల అధికారపార్టీకి చెందిన కొందరు నాయకులు వివక్ష చూపుతున్నారని, ఇళ్ల పట్టాల మంజూరు విషయంలో తమకు అనుకూలంగా ఉన్నవారికే పట్టాలు మంజూరు చేస్తామని మిగిలిన వారిపై వివక్ష చూపడం దారుణమన్నారు. వల్లూరి రాజబాబు, కుంచే అంజిబాబు, దుర్గాదేవి, నాగరాజు,ఏసియ్య తదితరులున్నారు.

ఖాళీ స్థల పన్నులు చెల్లించకపోతే చర్యలు

కమిషనర్ సత్యనారాయణ

కార్పొరేషన్(కాకినాడ), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఖాళీ స్థల పన్ను విధింపులో నిర్లక్ష్యం వహిస్తున్న యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, కార్పొరేషన్ స్పెషల్ ఆఫీసర్ షాన్‌మోహన్ సగిలి ఆదేశాల మేరకు కాకినాడ నగరపాలక సంస్థ రెవెన్యూ అధికారులు చర్యలు ప్రారంభించారు. ఖాళీగా ఉన్న స్థలాలకు పన్ను చెల్లించకపోవడం, లేదా ఇప్పటికే ఖాళీ స్థలం ఉన్నప్పటికీ పన్ను విధింపుకు సంబంధిత వివరాలు సమర్పించకపోవడం వల్ల నగరపాలక సంస్థ చట్టం 1955 ప్రకారం ఆస్తుల జప్తు చర్యలు అమలులోకి వస్తాయని కాకినాడ కమిషనర్ ఎన్‌వివి.సత్యనారాయణ స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ ద్వారా ఇప్పటికే నోటీసులు పంపినప్పటికీ పన్నులు చెల్లించని ఖాళీ స్థల యజమానుల వివరాలను రెవెన్యూ శాఖ ప్రత్యేకంగా గుర్తించిందని చెప్పారు. వారిపై ఆస్తిజప్తు ప్రక్రియను అమలుచేయడానికి ఉత్తర్వులు జారీ చేసినట్లు వెల్లడించారు. పన్నులు చెల్లించకుండా ఉండడం వల్ల నగరాభివృద్ధి, పారిశుధ్య సేవలు, పౌర అవసరాల కోసం వినియోగించే నిధులు దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు. ఈనేపథ్యంలో ఖాళీ స్థల యజమానులు తక్షణమే స్పందించి ఆస్తి పన్ను, ఖాళీ స్థల పన్నులను డిసెంబరు 20లోపు తప్పనిసరిగా చెల్లించాలని కమిషనర్ సత్యనారాయణ కోరారు. గడువు దాటిన పక్షంలో ఆస్తి జప్తు చర్యలు నిలుపుదల చేయకుండా అమలు చేస్తామని హెచ్చరించారు. పన్ను చెల్లింపు, వివరాల కోసం కేంద్రం స్థలం సిటీ సివిక్ సెంటర్ కమిషనర్ కార్యాలయం పరిధి కాకినాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం శారదా దేవి గుడి సమీపంలో వార్డు సచివాలయ సంబంధిత వార్డు పరిధిలో చెల్లించవచ్చన్నారు.

పశువుల తరలింపు చర్యలు

నగరంలో రోడ్డుపై సంచరిస్తూ ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్న పశువులను జంతు ఆశ్రయాలకు తరలించే చర్యలను మున్సిపల్ అధికారులు రెండోరోజు కూడా కొనసాగించారు. శనివారం ఉదయం సినిమా రోడ్డు పరిసరాల్లో రోడ్డుపై వదిలిపెట్టిన పశువులను మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది గుర్తించి ఎస్‌పిసిఏకు తరలించారు. తరలింపు కార్యక్రమాన్ని కమిషనర్ సత్యనారాయణ పర్యవేక్షించారు. రోడ్డుపై పశువులు కనిపించినప్పుడు వెంటనే చర్యలు తీసుకుని ఎస్‌పిసిఏకి తరలించాలని సిబ్బందికి సూచించారు. అదనపు కమిషనర్ కెటి సుధాకర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృధ్వీచరణ్, శానిటేషన్ సూపర్‌వైజర్ రాంబాబు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు సుదర్శన్, సత్తిబాబు, దుర్గారావు, ధర్మాజీ ఉన్నారు.



పశువులు తరలించే సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ సత్యనారాయణ

బంగారం వర్తక సంఘం అధ్యక్షుడిగా అనిశెట్టి

కలెక్టరేట్ (కాకినాడ), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ బంగారం వెండి డైమండ్స్ వర్తక సంఘం నూతన అధ్యక్షుడిగా అనిశెట్టి రామకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాకినాడ తిలక్‌వీధిలో శనివారం బంగారం వెండి డైమండ్స్ వర్తక సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అనంతరం నూతన కార్యవర్గం ఎన్నికలు నిర్వహించారు. దీనిలో కార్యదర్శిగా శ్రీనివాసు, ట్రెజరర్‌గా జానీ, జాయింట్ సెక్రటరీగా ఆవుపాటి సత్యనారాయణ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్ష పదవికి బహాదూర్, మాణిక్యాలరావు పోటీ పడగా బహాదూర్‌కు అత్యధిక ఓట్లు పోలవ్వడంతో ఆయన గెలుపొందారు. తదనంతరం నూతన కార్యవర్గాన్ని జనసేన నాయకుడు దుగ్గన బాబ్జి గజమాలతో సత్కరించారు. అనిశెట్టి రామకృష్ణ మాట్లాడుతూ బంగారం వెండి డైమండ్స్ వర్తకుల సమస్యల పరిష్కారానికి అహర్నిశలు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. నిరంతరం వర్తకులకు అందుబాటులో ఉండి వారికి అండగా నిలుస్తానని భరోసా ఇచ్చారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి : ఎంపీపీ



కరప మండల సర్వసభ్య సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంపీపీ శ్రీలక్ష్మి

కరప, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజల సమస్యల పరిష్కారానికి సభ్యులు కృషి చేయాలని ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి సూచించారు. స్థానిక చంద్రన్న సమావేశ మందిరంలో శనివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె ప్రసంగించారు. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా అధికారులు, ప్రజాప్రతినిధులు పనిచేసి ఆదర్శ మండలంగా తీర్చిదిద్దాలన్నారు. మండలంలో గత 3 నెలల్లో జరిగిన అభివృద్ధిపై ఆయా శాఖల అధికారులు సభ్యులకు వివరించి వారి సందేహాలను నివృత్తిచేశారు. వేళంగి, కూరాడ గ్రామాల్లో రీసర్వే సమస్యలను సభ్యులు సవిలే నీలిమారాజేష్, గుత్తుల శాంతిబాలాజీ లేవనెత్తారు. రెండేళ్లుగా సభ్యులకు గౌరవవేతనం అందించడంలేదని వాకాడ ఎంపీటీసీ లకమన వెంకటరమణ, ఇతర సభ్యులు అధికారులను నిలదీశారు. మండల పరిషత్ కార్యాలయ పరిపాలనాధికారి(ఏవో) బీఎల్ నరసింహం 2025-26 సవరణ బడ్జెట్, 2026-27 అంచనా బడ్జెట్‌లను సభలో చదివి వినిపించారు. అన్ని పద్దుల కింద వచ్చే ఆదాయం, వ్యయాలను వివరించి రూ.1,10,300 మిగులు బడ్జెట్‌కు సభ్యులు చప్పట్లతో ఆమోదం తెలిపారు. మండలపరిషత్ కార్యాలయ ఆవరణలోని గాంధీజీ విగ్రహానికి నివాళులర్పించి సర్వసభ్య సమావేశాన్ని ప్రారంభించారు. ఎంపీపీ శ్రీలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీడీవో జె.శ్రీనివాసరావు, తహశీల్దార్ తుమ్మల దుర్గాప్రసాద్, అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సొసైటీ ఛైర్‌పర్సన్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన లోకేశ్ ఫౌండేషన్ అధ్యక్షుడు

కాకినాడ సిటీ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ సెంట్రల్ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును నారా లోకేష్ యువజన ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మండపాక సుబ్బు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి నారా లోకేశ్, మాజీ ఎమ్మెల్సీ టీడీ జనార్ధన్ సహకారంతో ఫౌండేషన్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేపట్టామని వివరించారు. ఫౌండేషన్‌కు పార్టీ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని సీఎం అభినందించారు. ఫౌండేషన్ ప్రతినిధులు అడపా జగదీష్, మేడిచర్ల శ్రీను, కాలాడి వెంకటేష్ పాల్గొన్నారు.

డీసీసీబీ చైర్మన్‌ను కలిసిన కాకినాడ కమిషనర్

కాకినాడ రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామిని కాకినాడ డీసీసీబీ కార్యాలయంలో కాకినాడ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛంఅందజేశారు.



పుష్పగుచ్ఛం అందజేస్తున్న కమిషనర్

పాదగయలో ఆర్‌టీఐ కమిషనరు పూజలు

పిఠాపురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో పాదగయ క్షేత్రాన్ని స్టేట్ ఇన్ఫర్మేషన్ కమిషనరు(ఆర్‌టీఐ) చావలి సునీల్ శనివారం సందర్శించారు. కుటుంబసభ్యులతో కలిసి పాదగయలోని కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు ఆశీర్వచనాలు పలికి క్షేత్రప్రాశస్త్యాన్ని వివరించారు. సునీల్‌ను పాదగయ ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్ ఆలయ మర్యాదలతో సత్కరించి ప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల చిత్రపటాలను అందజేశారు. కాకినాడ ఆర్డీవో మల్లిబాబు, జిల్లా దేవదాయశాఖ అధికారి కనపర్తి నాగేశ్వరరావు, దేవాదాయశాఖ తనిఖీదారు వడ్డి ఫణీంద్రకుమార్, పిఠాపురం తహశీల్దారు పీవీ గోపాలకృష్ణ తదితరులు ఉన్నారు.

'ఆపదలో ఉన్నవారికి అండగా ప్రభుత్వం'

పిఠాపురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్నవారికి కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. ఆరోగ్య అవసరాలు నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా పిఠాపురంలో కాకి దేవి, పోలుపర్తి రాజేశ్వరి, వియ్యపు సూర్యనారాయణ, కేదారశెట్టి అమలావతిలకు మంజూరైన రూ.2.50లక్షలను చెక్కుల రూపంలో శనివారం వారి గృహాలకువెళ్లి వర్మ అందజేశారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు బొజ్జా సతీష్, కౌన్సిలర్లు ఉన్నారు.

సమర్థ భారత నిర్మాణానికి కలిసి పనిచేద్దాం

పిఠాపురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సమర్థ భారత నిర్మాణానికి కలిసి పనిచేద్దామని ఆర్ఎస్ఎస్ గోదావరి జిల్లాల కార్యవాహ్ పెమ్మరాజు సత్యరామచంద్రరావు పిలుపునిచ్చారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 28న పిఠాపురం బైపాస్‌రోడ్డులో నిర్వహించే హిందూ సమ్మేళనం కార్యక్రమం విజయవంతంపై చర్చించేందుకు శనివారం పట్టణంలోని సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం చెలికాని భావనరావు సభాసదన్‌లో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. సమ్మేళనం నిర్వహణ కమిటీ గౌరవాధ్యక్షురాలిగా నియో విద్యాసంస్థల చైర్మన్ బుర్రా దివ్యరాజ్, అధ్యక్షుడిగా బాదం సూర్యప్రకాష్, ఉపాధ్యక్షులుగా కార్తికేయ ఆసుపత్రి అధినేత మొగలి కాశీవిశ్వనాథ్, విశ్రాంత మున్సిపల్ కమిషనరు వెన్నపు చక్రధరరరావు, కార్యదర్శిగా పెమ్మరాజు సత్య రామచంద్రరావు, కోశాధికారిగా కంచర్ల మహేష్‌లు ఎన్నికయ్యారు. కొండేపూడి శంకరరావు, ఏ.నగేష్ పాల్గొన్నారు.

సర్పవరంలో క్రిస్మస్ వేడుకలు

సర్పవరం జంక్షన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ సర్పవరంలో ఎస్కోల్ వర్షిప్ సెంటర్‌లో జిల్లా యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ సిటీ రీజినల్ చైర్మన్ దడాల జాషువాగిరి ఆధ్వర్యంలో ఘనంగా ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఎస్కోల్ చర్చి పాస్టర్ దేవిశెట్టి చార్లెస్ అధ్యక్షతన జరిగిన వేడుకల్లో ముఖ్య అతిథి డాక్టర్ వరప్రసాద్ సందేశం ఇచ్చారు. ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. కేక్ కట్ చేసి క్యాండిలైట్ సర్వీస్ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు సామ్యూల్ సాగర్, గౌరవాధ్యక్షుడు జోసెఫ్ బెన్నీ పాల్గొన్నారు.



పాల్గొన్న పాస్టర్ల సంఘం ప్రతినిధులు

ఇందిరా కాలనీలో ముగ్గుల పోటీలు

ప్రత్తిపాడు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో ఇందిరా కాలనీలో శనివారం ముగ్గులపోటీలు నిర్వహించారు. స్థానిక మాజీ ఎంపీటీసీ శెట్టిబత్తుల వీరబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ముగ్గుల పోటీ ల్లో పాల్గొని ఇందిరా కాలనీ రహదారులపై రంగవల్లులు వేశారు. గెలుపొందిన విజేతలకు పాస్టర్, ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు. న్యాయనిర్ణేతలుగా యూటీఎఫ్ నాయకురాలు దేవి వ్యవహరించారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

మావోయిస్టులకు వ్యతిరేకంగా ర్యాలీ



చట్టిలో ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్థులు

చింతూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం, చట్టి కూడలివద్ద గ్రామస్థులు మావోయిస్టులకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారంతా మావోయిస్టుల తీరుని నిరసిస్తూ నినాదాలు చేశారు. తరచూ ఏదో ఒక కారణం చూపుతూ మావోయిస్టులు బంద్‌కు పిలుపుని వ్వడంతో రాకపో కలకు తీవ్ర అంతరాయం కలుగుతుందన్నారు.

వాహనదారులు భద్రతా నియమాలు పాటించాలి

మారేడుమిల్లి, డిసెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): పర్యాటక ప్రాంతంలో వాహనదారులు భద్రతా నియమాలను ఖచ్చితంగా పాటించాలని రంపచోడవరం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఆర్.రాజేష్ అన్నారు. శనివారం మారేడుమిల్లిలో వనవిహారివద్ద వాహన తనిఖీలు నిర్వహి ంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ప్రతి వాహన చోదకుడు లైసెన్స్ తప్పని సరిగా కలిగి ఉండాలని, సీట్ బెల్ట్, హెల్మెట్ ధరించాలన్నారు. వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలను ఖచ్చితంగా ఉండాలన్నారు. ఈ తనిఖీల్లో 14 వాహనాలకు రూ.1,04,240 లు జరిమానాలు విధించినట్టు తెలిపారు.

ఐటీడీఏ కార్యాలయంలో ఆధార్ కేంద్రం ఏర్పాటు



ఆధార్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీవో స్మరణ్‌రాజ్

రంపచోడవరం, డిసెంబర్ 6(ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ పీవో స్మరణ్‌రాజ్ అన్నారు. శనివారం రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఐటీ సొల్యూషన్ ద్వారా అధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, ఐదు సంవత్సరాలు దాటిన పిల్లలు ఆధార్ అప్డేట్, బయోమెట్రిక్, జిల్లాల మార్పిడి తదితర సేవలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏజెన్సీ ప్రాంతానికి ప్రభుత్వం 75ఆధార్ కేంద్రాలను మంజూరు చేసిందన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ నెంబర్ 9573029869ను సంప్రదించాలని సూచించారు. ఏపీవో(జీ) డీఎన్వీ రమణ, పీఎంయూ అధికారి మోహన్, ఆధార్ కేంద్రాల పర్యవేక్షకులు ప్రదీప్ కుమా ర్, సునీల్‌కుమార్, రాజారెడ్డి పాల్గొన్నారు.

క్వారీ బాధితులపై తప్పుడు నివేదికలు

● అధికారులపై చర్యలు తీసుకోవాలి ● ఆదివాసీ సంక్షేమ పరిషత్

రంపచోడవరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నరసాపురం క్వారీ వలన నష్టపోతున్న బాధితులపై జిల్లా కలెక్టర్‌కు తప్పుడు నివేదికలు సమర్పించిన మైనింగ్, రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ ప్రధాన కార్యదర్శి కుంజ శ్రీను డిమాండ్ చేశారు. క్వారీ బాధితులకు న్యాయం చేయకుండా అధికారులకు ముడు పులు ఇస్తూ క్వారీ నడిపిస్తున్న వారిపై న్యాయపరంగా ముందుకు వెళతామన్నారు. బాధితులకు అండగా ఈనెల 8న పాడేరు జిల్లా కలెక్టర్ కార్యాలయంవద్ద శాంతియుత నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు.

'అంబేడ్కర్ అందరికీ ఆదర్శనీయుడు'



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

రంపచోడవరం, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రధాన కూడలిలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ చోళ్ల బొజ్జిరెడ్డి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగంతో దేశంలోని ప్రతిపౌరునికి సమాన హక్కులు, స్వేచ్ఛ, న్యాయం కల్పించ బడ్డాయన్నారు. అనంతరం పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. సర్పంచ్ మంగా బొజ్జయ్య, రమణయ్య, మాదే రామచంద్రరావు, నల్లమిల్లి వెంకట రామారెడ్డి, బోండ్ల వరప్ర సాద్, తుమ్మల నాగేశ్వరరావు, కాళ్ల జయకర్, వెన్నెల పండు పాల్గొన్నారు.

మోతుగూడెం(ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం జగదాంబ సెంటర్లో శనివారం డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ వర్ధంతి లోయల్ సీలేరు ఏపీ ఎస్ఈబీ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్‌లో ఈ కార్యక్రమం నిర్వహిస్తామని ముఖ్య అతిథులుగా, సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ కేవీ రాజారావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.బాలకృష్ణ, డీఈటీ వరప్రసాద్, సీనియర్ అకౌంట్ ఆఫీసర్ వరప్రసాద్, ఏడీఈ కొండబాబు, జేవోలు కిరణ్, ఆనంద్, ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా మండల వ్యాప్తంగా అంబేడ్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు అధికారులు, ప్రజాప్రతినిధులు నివాళులర్పించారు. ఎంపీడీవో కార్యాలయ సమీపంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి ఏపీఐసీ డైరెక్టర్, టీడీపీ మండలాధ్యక్షుడు గొల్లపూడి పెద్దిరాజు పూలమాలలువేసి నివాళులర్పించారు. జనసేన మండలాధ్యక్షుడు బొదిరెడ్డి త్రిమూర్తులు, తదితరులు ఉన్నారు.

అడ్డతీగల(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదివాసీ భవనంలో శనివారం రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ వర్ధంతిని ఏఐకెఎంఎస్, పీడీఎస్‌యూ, ఆదివాసీ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఐవీ రమణ మాట్లాడుతూ మారేడుమిల్లి మావోయిస్టు హిడ్మా ఎన్‌కౌంటర్‌పై నిజనిర్ధారణ కోసం వచ్చిన తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఉస్మానియా, కాకతీయ వంటి విశ్వవిద్యాలయాల విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేసి అక్రమంగా నిర్బంధించడాన్ని ఖండించారు.

గండిపోశమ్మ ఆలయ దర్శనాలు తాత్కాలికంగా నిలుపుదల

దేవీపట్నం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొందూరు గ్రామంలో ఉన్న శ్రీ గండిపోశమ్మ అమ్మవారి దర్శనాలు తా త్కాలికంగా నిలుపుదల చేస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. అమ్మవారి ఆలయం వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తున్నందున దర్శనాలు నిలుపుదల చేశామని పునః ప్రారంభించే తేదీ ప్రకటించే వరకు భక్తులు ఎవరూ ఆలయ పరిసరాలకు రావద్దన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

వీఆర్‌పురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) మండల కేంద్రంలోని వడ్డిగూడెం కాలనీకి చెందిన కె.యశోధకు 40వేలు, ముత్యాల వెం కటసాయికి రూ.52వేల చెక్కులను సీఎం సహాయనిధి నుంచి ఆసుపత్రి ఖర్చుల నిమి త్తం శనివారం మండల కూటమి నాయకులు బాధితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బొర్ర నరేష్‌కుమార్, జనసేన మండల అధ్యక్షుడు ముకాల సాయి కృష్ణ మాజీ జడ్పీటీసీ ముత్యాల రామారావు, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు ముత్యాల సిద్ధార్థ, బాగుల ప్రమీలా, బాగుల అంజన్ రావు, విష్ణుమూర్తి, రాంబాబు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

చింతూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఎస్ఐ పి.రమేష్ పేర్కొన్నారు. శనివారం చింతూరు ఎంపీడీవో కార్యాలయంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ నేతృత్వంలో బాల్య వివాహ నిరోధక కమిటీ సమావేశం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్ఐ రమేష్ పాల్గొన్నారు.. ప్రతిఒక్కరూ చదువుకోవాలన్నారు. తదుపరి ఎంపీడీవో శ్రీనివాసుదొర మాట్లాడారు. గ్రా మాల్లో డ్రాప్ అవుట్స్ లేకుండా ప్రతి చిన్నారి ని బడిలో చేర్పించాలన్నారు.

మృతిచెందిన ఎంఈవో కుటుంబానికి ఆర్థిక సాయం

వై.రామవరం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): వై.రామవరం మండలం ఎంఈవోగా పనిచేసి గతనెల 6న రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కె.తాతబ్బాయి దొర కుటుంబానికి మండల ఉపాధ్యాయులు శనివారం రూ.1.09లక్షలు అందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సంతాప సభలో ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంఈవో జోగేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తాతబ్బాయిదొర కుటుంబానికి సానుభూతి తెలిపారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

అంబేడ్కర్ బాటలో పయనిద్దాం



తుని రూరల్: తేటగుంట టీడీపీ కార్యాలయంలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న దృశ్యం

జగ్గంపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ బాటలో ముందుకు సాగాలని ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కొత్త కొండబాబు అన్నారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా ఆర్పీఐ సౌత్ ఇండియా ఆర్గనైజింగ్ సెక్రటరీ పులి ప్రసాద్ ఆధ్వర్యంలో జగ్గంపేట హైస్కూల్ అంబేడ్కర్ విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అంబేడ్కర్ విగ్రహానికి పలువురు నివాళులర్పించారు.



ప్రత్తిపాడు పంచాయతీ కార్యాలయం వద్ద అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న దృశ్యం

ఆశయసాధనకు కృషి చేద్దాం: అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేద్దామని జనసేన ఇన్‌చార్జి టి.రమేష్ అన్నారు. శనివారం అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా జగ్గంపేట పరివర్తన స్థలంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో ఆర్పీఐ పార్టీ సౌత్ ఇండియా ఆర్గనైజింగ్ సెక్రటరీ పులి ప్రసాద్, మాదారపు వీరబాబు, కురుమల్ల నాగేశ్వరావు, బద్దికొండ వెంకటరమణ గోకేడ ప్రసాద్, పాట్టంశెట్టి రమేష్, గంగబాబు ఇతరులు ఉన్నారు

స్ఫూర్తి ప్రదాత అంబేడ్కర్

తుని రూరల్(ఆంధ్రజ్యోతి): స్ఫూర్తి ప్రదాత అంబేడ్కర్ అని మాజీ మంత్రి, కాకినాడ జిల్లా వైసీపీ అధ్యక్షుడు దాడిశెట్టి రాజా అన్నారు. అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని తునిలోని సీఎంఆర్ సెంటర్‌లో అంబేడ్కర్ కాంస్య విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు వైసీపీ నాయకులు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

తుని రూరల్(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని తేటగుంట టీడీపీ క్యాంప్ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. దీనికి ముఖ్య అతిథిగా టీడీపీ సీనియర్ నాయకుడు యనమల రాజేష్, టీడీపీ మండల అధ్యక్షులు చింతమనీడి అబ్బాయిలు హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ తొండంగి మండల అధ్యక్షుడు చొక్కా అప్పారావు, ఎ.అచ్చుతరావు, కె.అబ్బులు, గజ్జి రాంబాబు, కొల్లు సత్యనారాయణ, చామంతి సత్తిబాబు తదితరులు ఉన్నారు.

బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్

ప్రత్తిపాడు(ఆంధ్రజ్యోతి): బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్ అని వక్తలన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ గుడాల విజయలక్ష్మి, కార్యదర్శి జ్యోతుల పద్మరాజుల ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పలువురు నివాళులర్పించారు. కళామందిర్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి కూటమి నాయకులు కొమ్ముల కన్నబాబు, మదినే దొరబాబు, పోలిశెట్టి శ్రీను తదితరులు నివాళులర్పించారు. కోర్టు వద్ద అంబేడ్కర్ చిత్రపటానికి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజాల చిట్టిబాబు, సీనియర్ న్యాయవాదులు పల్లా వీర్రాజు, మంజూషా, న్యాయవాద గుమాస్తాలు, కోర్టు సిబ్బంది అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు.

ఏలేశ్వరం(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక పాత బస్‌స్టాండ్, వెంగళరావు, అంబేడ్కర్‌నగర్, క్వారీ ఏరియా కాలనీలలో జైభీమ్ టీం, దళిత నాయకులు, టీడీపీ, బీజేపీ నాయకుల నేతృత్వంలో అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కోనాల వెంకటరమణ, యండగుండి నాగబాబు, ఆర్.చిన్న, ఎం.నారాయణస్వామి, బి.గోపి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ గొప్ప దార్శనికుడు

కిర్లంపూడి(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ గొప్ప దార్శనికుడని వైసీపీ ప్రత్తిపాడు ఇన్‌చార్జి ఎం.గిరిబాబు అన్నారు. శనివారం అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా కిర్లంపూడి ఎస్సీపేటలోని అంబేడ్కర్ విగ్రహానికి, కాపులవీధి ఏనుగువీధి రామాలయం వద్ద అంబేడ్కర్ విగ్రహానికి వారు నివాళులర్పించారు.



కిర్లంపూడిలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న దృశ్యం



రోశయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

మహోన్నత వ్యక్తి మాజీ సీఎం రోశయ్య

జగ్గంపేట, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో మాజీ గవర్నర్ రోశయ్య వర్ధంతిని జగ్గంపేట ఆర్యవైశ్య సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. దీనికి ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్, జగ్గంపేట ఆర్యవైశ్య సేవా సంఘం అధ్యక్షులు కొత్త వెంకటేశ్వరరావు, జగ్గంపేట ఎంపీపీ అత్తులూరి నాగబాబు ముఖ్య అతిథులుగా హాజరై దివంగత రోశయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ గవర్నర్ మానేపల్లి బంగార్రాజు, బొండా నూకబాబు, కొత్త శ్రీరామకృష్ణ (రాము), చిత్రపు బాబు, బొండా వీర సత్య, వి.నాగసత్య, బొండాడ జగన్, పాబోలు స్వామి, కంచర్ల బాబు తదితరులు పాల్గొన్నారు.



సింహాద్రి అప్పన్న ఆలయంలో జ్యోతుల కుటుంబ సభ్యుల పూజలు

జగ్గంపేట, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): విశాఖలో సింహాచలం సింహాద్రి అప్పన్న స్వామిని జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ కోడలు, కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షు, జగ్గంపేట నియోజకవర్గం అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల నవీన్ సతీమణి జ్యోతుల లక్ష్మీదేవి శనివారం స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ఏఈఓ ఇతర అధికారులు కలిసి ఆమెకు స్వాగతం పలికారు. వేద పండితుల ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఆమె వెంట నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షులు అనుకుల శ్రీకాంత, నియోజకవర్గ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ భూపాలపట్నం ప్రసాద్, బన్నీ, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జగ్గంపేట జనసేన ఇన్‌చార్జ్ రమేష్

తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం

జగ్గంపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కిర్లంపూడి మండలం రామచంద్రపురం స్కూల్‌లో వైస్ ప్రెసిడెంట్ రేవూరి శ్రీను అధ్యక్షతన జరి గిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జగ్గంపేట జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో పెను మార్పులు తీసుకురావడానికి ప్రతి సంవత్సరం మెగా పేరెంట్స్, టీచర్స్ డే ఏర్పాటు చేసి రెండో సంవత్సరం కూడా విజయవంతంగా రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని తీసుకున్నారని, విద్యార్థిని విద్యార్థులు ఈ మౌలిక వసతులు ఉపయోగించుకుని మంచి విద్యను అభ్యసించి మంచి ఉన్నత స్థితికి చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తుమ్మలపల్లి శేఖర్,స్కూల్ చైర్మన్ స్వప్న, మేడిబోయిన శ్రీను, మేడిబోయిన గంగా, అంకం ఓం కృష్ణస్కూల్ విద్యార్థి విద్యార్థినులు, నాయకులు పాల్గొన్నారు



ప్రత్యేక అవసరాల పిల్లలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం

గండేపల్లి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలో మల్లేపల్లి కాంప్లెక్స్ పరిధిలో ప్రాథమిక పాఠశాల న్యూ కాలనీ భవిత ఉప కేంద్రంలో శనివారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎంఈవో కెహెచ్ నాయక్, హెచ్ఎంలు సీహెచ్ అన్నపూర్ణ, టి.విజయవల్లి హాజరయ్యారు. ప్రత్యేకావసరాల పిల్లలకు సమగ్రశిక్ష ద్వారా వచ్చే సదుపాయాలు, సౌకర్యాలు, ఉపకరణాలు, విద్యను, అంధ విద్యార్థులకు బ్రెయిలీ పుస్తకాలు అందించే అంశాలపై వివరించారు. ఈసందర్భంగా ప్రత్యేకావసరాల పిల్లలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో భవిత కేంద్ర ఉపాధ్యాయులు ఎస్.లోవ, జె.ప్రకాశరావు, సీఆర్పీఎస్ లక్ష్మణరావు, తాతబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు ఆసుపత్రి వద్ద నిరసన

● భూపాలపట్నం మృతుని బంధువులు, దళితుల ఆందోళన

ప్రత్తిపాడు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రి ఎదుట శనివారం కిర్లంపూడి మండలం భూపాలపట్నంలో మృతి చెందిన కాకర అప్పన్న కుటుంబీకులు, బం ధువులు, దళిత సంఘాలు నిరసన ఆందోళనను చేపట్టారు. కాకర అప్పన్న మృతికి బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని మృతుడి కుటుంబీకులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆసుపత్రి ఎదుట రహదారిపై బైఠాయించారు. భూపాలపట్నంలో కాకర అప్పన్నను దారుణంగా హతమార్చారని దీనిపై పూర్తి విచారణ చేపట్టాలని వారు నిరసన వ్యక్తం చేశారు. పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, సీఐ వైఆర్‌కె శ్రీనివాస్, ఎస్ఐలు సతీష్, లక్ష్మీకాంతం తదితరులు పోలీసులు ఆసుపత్రిలో మోహరించారు. పరిస్థితులు బందోబస్తు నిర్వహించారు.

దేవీపట్నంలో శేరిన్ స్వచ్ఛంద సంస్థ సేవలు

దేవీపట్నం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): శేరిన్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు శనివారం దేవీపట్నం ఎంపీడీవో సల్మాన్‌రాజు, ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ క్రాంతిను మర్యాదపూర్వకంగా కలిశారు. శేరిన్ సంస్థ చైర్మన్ మోస్య ప్రసన్నకుమారి మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో అనారోగ్య సమస్యలు రాకుండా ఎంఎల్‌టీ, జీఎన్ఎం కోర్సుల్లో ట్రైనింగ్ పొందిన నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తూ వారిని వలంటీర్స్‌గా ఏర్పాటుచేసుకుని గిరిజనప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. సూపర్‌వైజర్లు బి.శ్రీను, ప్రసాద్, కుంజం రమేష్‌దొర, నవీన్, సూరిబాబు, గంగాభవానీ, వెంకటలక్ష్మి, సత్యదేవి, మంగాదేవి పాల్గొన్నారు.

నిరుపేదల ఆరోగ్యానికి భరోసా సీఎం సహాయనిధి

● ఎమ్మెల్యే సత్యప్రభ



పెదశంకర్లపూడిలో బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న దృశ్యం

ప్రత్తిపాడు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నిరుపేదల ఆరోగ్యానికిభరోసాగా సీఎం సహాయ నిధి అండగా నిలుస్తుందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ చెప్పారు. మండలంలోని పెదశంకర్లపూడిటీడీపీ కార్యాలయం వద్ద శనివారం నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, రాచపల్లి, పోతులూరు, కత్తిపూడి, కొంతంగి, కొత్తూరు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులు అందజేశారు. రూ.24,50,339లు విలువైన చెక్కులను ఆయా గ్రామాల నాయకుల సమక్షంలో ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. లబ్ధిదారులు, కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎమ్మెల్యే సత్యప్రభకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నేతృత్వంలో బడుగు బలహీనవర్గాల సంక్షేమం,ఆరోగ్యం పట్ల పూర్తి బాధ్యతగా భరోసా కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఖాదీ బోర్డు వైస్ చైర్మన్ కొమ్ముల కన్నబాబు, రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వెన్నా ఈశ్వరుడు, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు కీర్తి వెంకట సుభాష్, సీబీఎన్ ఆర్మీ కో ఆర్డినేటర్ యాళ్ళ జగదీష్, అన్నవరం దేవస్థానం మాజీ పాలకమండలి సభ్యులు బుద్దరాజు గోపిరాజు, సర్పంచ్ మంతెన శ్రీను, సొసైటీ చైర్మన్ గాబు కృష్ణమూర్తి, టీడీపీ నాయకులు పంచాది వీరబాబు, అమరాది వెంకట్రావు, కోలం చిన్న, మిరియాల శ్రీను, పోలిశె ట్టి శ్రీనివాస్, మదినేవెంకన్న దొర, కె.శ్రీను, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

రమణాశ్రమంలో వైద్య శిబిరం

ప్రత్తిపాడు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచపల్లి రమణాశ్రమంలో శనివారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఆశ్రమ వ్యవస్థాపకులు స్వామి రామానంద ప్రారంభించారు. ప్రత్తిపాడు పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకులు డాక్టర్ బాలచంద్రయోగేశ్వర్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ సతీష్‌కుమార్, ఒమ్మంగి, శాంతి ఆశ్రమం పశువైద్యాధికారులు నాగ సత్య మం జూషా, వెంకటేష్‌లు పశువులకు గర్భకోశ వైద్య చికిత్సలు నిర్వహించారు.

ఘనంగా గౌరీశంకర్ల ఉత్సవాలు

ప్రత్తిపాడు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో శనివారం గౌరీశంకర్ల ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. నెలరోజులుపాటు స్థానికులు గౌరీశంకర్లకు పూజలు నిర్వహించి శనివారం ముగింపోత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవాలపై ట్రాక్టర్లు, ఎడ్ల బండ్లపై స్థానికులు శక్తివేషాలు, సీతారామ లక్ష్మణ ఆంజనేయల , శివపార్వతులు, వినాయకుడు, దుర్గాదేవి, అల్లూరి సీతారామరాజు తదితర వేషధారణలతో స్థానిక కళాకారులు ప్రదర్శించిన వేషాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ ఉత్సవాలతో పలు వేషాలతో అలరించిన కళాకారులను ఖాదీబోర్డు వైస్ చైర్మన్ కొమ్ముల కన్నబాబు అభినందించారు.



ప్రత్యేక అలంకరణలో దుర్గమ్మవారు

నేడు దుర్గమ్మ తిరునాళ్లు ప్రారంభం

గండేపల్లి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): గండేపల్లి మండలం మురారి గ్రామ శివారున ఉన్న కనకదుర్గమ్మ తిరునాళ్లు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ తిరునాళ్లకు చుట్టుపక్కల ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతారు. ఆదివారం కావడంతో భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక ప్రదేశాలు ఏర్పాటు చేశారు. మురారి గ్రామం నుంచి ఆలయానికి చేరుకునే వరకు భక్తులకు ఇబ్బంది లేకుండా అన్ని చర్యలు తీసుకున్నారు.



వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

పి.నాయకంపల్లిలో వైద్య శిబిరం

గండేపల్లి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెం ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ స్పెషల్ క్యాంప్‌లో భాగంగా పి.నాయకంపల్లి గ్రామంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్థులకు రాజమండ్రి డెల్టా ఆసుపత్రి డాక్టర్లు కృష్ణవేణి, శిరీష, కృష్ణబాబు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎం.రఘునాథ్, సీహెచ్ రాంప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.రమేష్, ఎన్ఎస్ఎస్ సభ్యులు పాల్గొన్నారు.



గౌరీదేవి ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే నెహ్రూ

గౌరీదేవి ఉత్సవాలు

కిర్లంపూడి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కిర్లంపూడి, చిల్లంగి గ్రామాల్లో గౌరీదేవి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. నెల రోజుల పాటు అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి శనివారం మహిళలు సారె సమర్పణ చేశారు. అమ్మవారిని నిమజ్జనానికి తరలించారు. కిర్లంపూడి రమణయ్యపేట రామాలయం వద్ద గౌరీదేవి ఉత్సవాల్లో జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయన వెంట ఎంపీపీ తోట రవి, తోట గాంధీ, తూము కుమార్, కుర్ల చినబాబు, చదరం చంటిబాబు, టీడీపీ నాయకులు ఉన్నారు.

బంగారం వర్తక సంఘం అధ్యక్షుడిగా అనిశెట్టి

కలెక్టరేట్ (కాకినాడ), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ బంగారం వెండి డైమండ్స్ వర్తక సంఘం నూతన అధ్యక్షుడిగా అనిశెట్టి రామకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యా రు. కాకినాడ తిలక్‌వీధిలో శనివారం బంగా రం వెండి డైమండ్స్ వర్తక సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అనంతరం నూత న కార్యవర్గం ఎన్నికలు నిర్వహించారు. దీనిలో కార్యదర్శిగా శ్రీనివాసు, ట్రెజరర్‌గా జానీ, జాయింట్ సెక్రటరీగా ఆవుపాటి సత్యనారా యణ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్ష పదవికి బహదూర్, మాణిక్యాలరావు పోటీ పడగా బహదూర్‌కు అత్యధిక ఓట్లు పోలవ్వడంతో ఆయన గెలుపొందారు. తదనంతరం నూతన కార్యవర్గాన్ని జనసేన నాయకుడు దుగ్గన బాబ్జి గజమాలతో సత్కరించారు. అనిశెట్టి రామకృష్ణ మాట్లాడుతూ బంగారం వెండి డైమండ్స్ వర్తకుల సమస్యల పరిష్కారానికి అహర్నిశలు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. నిరంతరం వర్తకులకు అందుబాటులో ఉండి వారికి అండగా నిలుస్తానని భరోసా ఇచ్చారు.